TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక: 207 శుక్రవారం, జూన్ 12, 2026 పేజీలు: 8 వెల.1/-




# తెలంగాణ ఫ్యూచర్‌సిటీలో మరో 37 గ్రామాలు విలీనం..

## ఆ విజ్ఞప్తులతో రేవంత్ నిర్ణయం!

హైదరాబాద్, జూన్ 11 తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫోర్త్ సిటీ' లేదా 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా పరిధిలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ప్రాజెక్టు పరిధిని మరింతగా విస్తరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి కొత్తగా గ్రామాల విలీనం స్థానిక రైతులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి కొత్తగా మరో 37 గ్రామాలను విలీనం చేయడానికి సీఎం ఆమోదం తెలిపారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ ఆయన ఫైలుపై సంతకం చేశారు. సీఎం సభలో గ్రామస్తుల అభ్యర్థన రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎఫ్‌సీడీఏ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో.. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో చేర్చాలంటూ స్థానిక ప్రజలు ప్లకార్డులతో అభ్యర్థించారు. కందుకూరు, మహేశ్వరం మండలాల్లో 37 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనం దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సంకల్పానికి గౌరవమిస్తూ రేవంత్ రెడ్డి అక్కడికక్కడే సానుకూల నిర్ణయం ప్రకటించారు. కొత్తగా విలీనమయ్యే ఈ 37 గ్రామాలలో మహేశ్వరం మండలానికి చెందిన 28 గ్రామాలు, కందుకూరు



మండలానికి చెందిన 9 గ్రామాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎఫ్‌సీడీఏ పోర్టల్‌ను కూడా ప్రారంభించిన ముఖ్యమంత్రి, ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామంటూ కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను కూడా ఇలాగే వ్యతిరేకించారని, కానీ ఈరోజు అవే హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చాయని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో భూముల విలువ బంగారం కంటే ఎక్కువగా పెరిగిందని, భవిష్యత్తులో స్థానికులతో చర్చించి మరికొన్ని గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రైతన్నలారా ఇకనైనా మారండి

## రసాయన ఎరువులను వాడకండి: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

జమ్మికుంట : జమ్మికుంట కేవీకేలో ప్రక్రుతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి.రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రక్రుతి వ్యవసాయంపై ద్రుష్టి సారించాలని కోరారు. ప్రక్రుతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు మద్దతు ధర రాదనే బాధ అక్కర్లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశముందన్నారు. కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవు మళ్లించడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తి నేపథ్యంలో ఆయన స్పూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని క్రుషి విజా&ఝున కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రు నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్టు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ను,ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. భూమి పూజ చేశారు. మొక్క నాటారు. ప్రక్రుతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రుతి వ్యవసాయాన్ని పెంపొందించేందరుకు క్రుషి విజా&ఝున కేంద్రం చేస్తున్న క్రుషిపై ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్ ప్రసంగించారు. ముఖ్యాంశాలు:గోమాత, భూమాత, భరతమాత నినాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రాబోయే







రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట క్రుషి విజా&ఝున కేంద్రం నిర్వాహకులను,సిబ్బందిని మనస్పూర్తిగా అభినందిస్తున్నా. ఈ దేశంలో కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లిస్తానని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు స్పూర్తితో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే రెండేళ్లలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయం వైపు మళ్లిస్తా. జమ్మికుంట కేవీకే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.రసాయన ఎరువులతో వ్యవసాయం చేస్తూ అధిక పంట పండిస్తూ,రోగాలు కొని తెచ్చుకుంటున్నాం. ఉజ్బెకిస్తాన్ వంటి దేశం రసాయనాలు వాడటంవల్ల సర్వనాశనమైంది. దేశానికి అన్నపూర్ణగా విలసిల్లిన పంజాబ్ లో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ కావడంవల్ల క్యాన్సర్ రోగులు ఎక్కువయ్యారు. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక ట్రైన్ వెళుతున్న ద్రుశ్యాలు అత్యంత బాధాకరం.

# ఈ నెలాఖరులో కరీంనగర్ నూతన కలెక్టరేట్:

## సీఎం చేతుల మీదుగా ప్రారంభం - మంత్రి పొన్నం ప్రభాకర్


కరీంనగర్ : కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్మితమైన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు.గతంలో ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో పూర్తికాక నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రత్యేక చొరవ తీసుకుని మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తిచేయించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సహకారంతో అన్ని ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, పౌరులకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కూడిన కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని వెల్లడించారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పర్యావరణ హిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వ్యవస్థతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్‌ను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.జిల్లాను పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటు ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని చెప్పారు. గతంలో నిలిచిపోయిన విద్యా అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తూ మరిన్ని కోర్సులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, డంప్‌యార్డు తరలింపునకు కేంద్ర



ప్రభుత్వ సహకారం కోరినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఆర్డీవో షర్మిల, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 11: రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గురువారం నాడు రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఆధునిక సౌకర్యాలతో ఒకే నమూనాలో కార్యాలయాల నిర్మాణం ఉంటుందన్నారు. అద్దె, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు చెప్పారు. నిర్మాణాల కోసం స్థలాల



గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో తుది డిజైన్లకు రూపకల్పన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని విమర్శించారు. కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలన బలోపేతం చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం క్యూర్ పరిధిలో స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

# మధ్యప్రదేశ్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలు కైవసం చేసుకున్న బీజేపీ..



భోపాల్: మధ్యప్రదేశ్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. బీజేపీ అభ్యర్థులు రజనీశ్ అగర్వాల్, తరుణ్ చుగ్, మహేశ్ కేవత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. గెలుపొందిన అభ్యర్థులకు మధ్యప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోవడానికి నేడే(జూన్ 11) చివరి రోజు. అయితే, ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అయితే, నటరాజన్‌పై తెలంగాణలో క్రిమినల్ కేసు నమోదు అయ్యిందని.. ఆ విషయాన్ని నామినేషన్ పత్రాల్లో ఆమె వెల్లడించలేదని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ ఆరోపించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో అన్ని విషయాలు తెలియజేయాలని.. కానీ, ఉద్దేశపూర్వకంగానే నటరాజన్ కేసు విషయాన్ని దాచారని ఆయన వివరించారు. దీంతో గత మంగళవారం నాడు నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ మేరకు ఎన్నికలకు వెళ్లకుండానే బీజేపీ ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.కాగా, 10 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జూన్ 1న ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్-4, గుజరాత్-4, కర్ణాటక-4, మధ్యప్రదేశ్-3, రాజస్థాన్-3, ఝార్ఖండ్-2 స్థానాల చొప్పున ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

# రూ.5వేల కోట్ల భారీ స్కామ్‌ని భగ్నం చేశాం..: సజ్జనార్

హైదరాబాద్: గతంలో నిషేదానికి గురైన క్యూనెట్ సంస్థ సరికొత్తగా ఇగ్నైట్ పేరుతో అవతారం ఎత్తిందని సిపి సజ్జనార్ తెలిపారు. ఆ సంస్థ చేయాలనుకున్న దాదాపు రూ.5వేల కోట్ల భారీ మోసం కుట్రను భగ్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గురు వారం నిర్వహించిన మీడియా సమావే శంలో సిపి మాట్లా డారు. ఈ అంతర్జాతీ య నెట్‌వర్క్ గత 25 ఏళ్లుగా 'గోల్డ్ క్వెస్ట్', 'క్వెస్ట్ నెట్', 'క్యూనెట్'.. ప్రస్తుతం 'ఇగ్నైట్'గా పేరు మార్చుకొని అమాయకులను దోచుకుందని సిపి వివరించారు. దేశంలో లక్షల్లో బాధితులు ఉన్నారని తెలిపారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# సంపాదకీయం

శుక్రవారం, జూన్ 12, 2026

## టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కుంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

- ఎడిటర్

# వడివడిగా ఫ్యూచర్ సిటీ అడుగులు

హైదరాబాద్, జూన్ 11, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజధాని హైదరాబాద్ భౌగోళిక, ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో ఒక చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతం కాబోతోంది. ఈ మెగా గ్రీన్‌ఫీల్డ్ నగర అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ శాశ్వత కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించిన ఈ అత్యాధునిక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించి, ఇక్కడి నుంచే ఫ్యూచర్ సిటీ పనుల వేగాన్ని పరుగులు పెట్టించబోతున్నారు.ఈ కార్యాలయ ప్రారంభోత్సవ వేదికగానే తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టే ఒక అంతర్జాతీయ స్థాయి కీలక ఒప్పందం కూడా జరిగింది.దాదాపు 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ నయా నగరానికి సంబంధించి వరల్డ్-క్లాస్ సమగ్ర మాస్టర్ ప్లాన్ ను రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ డిపి ఆర్కిటెక్ట్స్ కు ప్రభుత్వం అప్పగించింది. గ్లోబల్ టెండర్లలో పాల్గొన్న ఆరు దిగ్గజ సంస్థల్లో అత్యంత తక్కువ బిడ్ తో నిలిచిన ఈ సింగపూర్ సంస్థకు, వేదికపైనే సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా 'వర్క్ ఆర్డర్' లేఖను అందజేశారు. రాబోయే తొమ్మిది నెలల కాలంలో ఈ గ్లోబల్ కన్సల్టెంట్ ఫ్యూచర్ సిటీ సమగ్ర బ్లూప్రింట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ జోన్ డెవలప్ మెంట్ పరిధిలో మొదటి విడతగా దాదాపు 30,000 ఎకరాల ప్రధాన జోన్‌పై అధికారులు దృష్టి సారించారు. ఇందులో దాదాపు 13,000 ఎకరాలను 'ప్రయారిటీ డెవలప్‌మెంట్ జోన్' గా గుర్తించి, వివిధ రంగాలకు చెందిన గ్లోబల్ క్లస్టర్లను ఇక్కడ విభజించారు. కొత్త ఆఫీస్ కేంద్రంగానే వీటికి సంబంధించిన పనులు సాగనున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం.. ఫ్యూచర్ సిటీలో 4,000 ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్, 403 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , 2,177 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ ఱ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్, 1,976 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్, 313 ఎకరాల్లో గ్లోబల్ డేటా సెంటర్ హబ్, 594 ఎకరాల్లో హెల్త్ సిటీ, 255 ఎకరాల్లో ఎడ్యుకేషన్ జోన్ , 2,477 ఎకరాల్లో అత్యాధునిక రెసిడెన్షియల్ జోన్‌లను నిర్మించబోతున్నారు. నగరంలో అస్తవ్యస్తంగా పెరుగుతున్న అర్బనైజేషన్ ఒత్తిడిని తగ్గించేందుకు, ఈ ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా, భారతదేశంలోనే మొట్టమొదటి 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా దాదాపు 15,000 ఎకరాల అటవీ ప్రాంతాన్ని సహజసిద్ధంగా కాపాడుకుంటూనే ఇకో-టూరిజం జోన్లను డిజైన్ చేస్తున్నారు. కాలుష్య రహిత సూత్రాల ఆధారంగా డాక్టర్ రెండీస్, భారత్ బయోటెక్, హెటెరో, ఎంఎస్ఎన్, అరబిందో వంటి ప్రముఖ ఫార్మా దిగ్గజాలు ఇక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాయి. వీటికి తోడు అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల మెగా డేటా సెంటర్లు, ఇప్పటికే పనులు ప్రారంభించుకున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' శాశ్వత క్యాంపస్, దాదాపు 50 ఎకరాల్లో నిర్మించబోయే లెదర్ ఇండస్ట్రీ స్కిల్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కొత్త క్యాంపస్ పనులను కూడా ఈ కొత్త అథారిటీ కార్యాలయం నుంచే వేగవంతం చేయనున్నారు. రావిర్యాల్ నుండి రీజనల్ రింగ్ రోడ్ లోని ఆమన్ గల్ వరకు దాదాపు రూ.4,621 కోట్లతో మెట్రో కనెక్టివిటీ కలిగిన 'రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్' ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి కూడా పునాది పడనుంది.

# దడ పుట్టించిన తొలి వర్షం..

హైదరాబాద్, జూన్ 11, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది.వాతావరణ పరిశీలకుల



హెచ్చరికల ప్రకారం.. అమీన్‌పూర్, పటాన్‌చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్‌లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి. ముఖ్యంగా బైక్ నడిపేవారు ఓవర్ టేక్‌లు చేయవద్దని, భారీ ఈదురుగాలులు వీస్తున్నందున చెట్ల కింద, పాత గోడల పక్కన వాహనాలను ఆపకూడదు అని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలపడనున్నందున ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

## కోలివింగ్ హాస్టల్స్ లో ఏం జరుగుతోంది...

హైదరాబాద్, జూన్ 11, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వీహెచ్ చేసిన సూచనపై ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నెటిజన్లు సూచిస్తున్నారు.ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఓ కో లివింగ్ హాస్టల్‌పై నుంచి ఒక యువతి దూకి ప్రాణాలు తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రియుడి వేధింపులను తట్టుకోలని ప్రియురాలు.. అదే కో లివింగ్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండే యువతీయువకులు చేసే పనులతో పరిసరాల్లో ఉండే నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

హైదరాబాద్, జూన్ 11 (న్యూస్ పల్స్)తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది.గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతంలో తన అడ్డాను ఏర్పాటు చేసుకున్న నీతూబాయి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడుల్లో గుర్తించారు.నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన నీతూబాయి.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఈ డ్రగ్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ అన్ని చర్యలు చేపట్టింది.ఒకప్పుడు సాధారణ గృహిణిగా ఉన్న నీతూబాయి స్వస్థలం ధూల్‌పేట్. ఆమె కుటుంబం మొత్తం గుడుంబా దందా చేసేది. అయితే ఆబ్కారీ శాఖ రాష్ట్రంలో గుడుంబా తయారీ, విక్రయాలపై పూర్తిగా నిషేధించడంతో వారు గంజాయి దందా మొదలుపెట్టారు. తమ బంధువులు అంతా ధూల్‌పేటను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తుండగా.. నీతూబాయి మాత్రం నానక్‌రాంగూడలోని లోధా బస్తీకి మకాం మార్చింది.

# అడగుంటున్న భూగర్భ జలాలు..

## నగరంలో 3 శాతం మాత్రమే నీరు

హైదరాబాద్, జూన్ 11 (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో రాష్ట్ర మొత్తం భూగర్భ జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది.ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది.మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

## పాకిస్తాన్ కు నీటి కష్టాలు...



శ్రీనగర్, జూన్ 11, (న్యూస్ పల్స్)పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ విషయంలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. దశాబ్దాల నాటి సిందూ జల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. రక్తం నీరు ఏకకాలంలో పారవని స్పష్టం చేసింది. దీంతో సింధూ జలాలు రాక పాకిస్తాన్‌లో కరువు చాయలు, ఆకస్మిక వరదలు వస్తున్నాయి. ఒప్పందం పునరుద్ధరణకు పాకిస్తాన్ అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు.తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ సింధు జలాల విషయంలో భారత్ కఠిన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. 'సింధు జలాల ఒప్పందం రద్దు చేయలేదు. ఇంకా అమలులోనే ఉంది. కానీ తాత్కాలికంగా నిలిపివేశాం. సరిహద్దు గుండా నీళ్లు వెళ్లకుండా ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఆర్.పాటిల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్ షా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు1960 సింధు జలాల ఒప్పందం ప్రస్తుతం హోల్డ్‌లో ఉంది. భారత్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, పాకిస్తాన్‌కు నీరు అందకుండా చేసేందుకు సాంకేతిక, ఇంజనీరింగ్ చర్యలు తీసుకోవడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలి సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భారత్ సింధు జలాలను ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. నీటిని భారత్ సొంత అవసరాల కోసం వినియోగించుకోవాలి అన్న ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలను అమలుకు చర్యలు చేపట్టారు.సింధూ జలాలను కేంద్రం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు మళ్లించాలని భావిస్తోంది. దీంతో ఆ రాష్ట్రాలకు అదనపు నీటి వనరులు లభించే అవకాశం ఉంది. శత్రు దేశానికి నీటిని వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా ఇప్పటికే సింధూ, దాని ఉప నదులపై బ్యారేజీలు నిర్మిస్తోంది. అధిక వర్షాలు ఉంటే గేట్లు ఎత్తి పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సృష్టిస్తోంది.భారత్?పాకిస్థాన్ మధ్య నీటి వివాదంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఒప్పందం నిలిపివేతను ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా భారత్ తన నీటి సార్వభౌమత్వాన్ని బలపరచుకోవాలని చూస్తోంది. ఈ అంశం రాబోయే రోజుల్లో ద్విపాక్షిక సంబంధాలపై ఎంత ప్రభావం చూపించనుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## అమిత్ షా కామెంట్స్ వెనుక కారణం అదేనా

### తెలంగాణ, పంజాబ్‌పై ప్రత్యేక వ్యూహం.

హైదరాబాద్, జూన్ 11, (న్యూస్ పల్స్)దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ.. ఉత్తర భారత దేశంలో ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒక్కటే కాంగ్రెస్ చేతిలో ఉంది. తాజాగా బెంగాల్‌లోనూ బీజేపీ పాగా వేసింది. ఇక ఇప్పుడు బీజేపీ దక్షిణాదిపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 2028లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాజకీయాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలోనైనా ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.తెలంగాణ, పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిగా పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే బీజేపీ వ్యూహం రూపొందిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అమిత్‌షా తెలిపారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ రాజకీయ వ్యూహంలో ముఖ్యమైన మలుపును సూచిస్తున్నాయి. గతంలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పొత్తుల ద్వారా అడుగుపెట్టిన బీజేపీ, ఇప్పుడు ఒంటరి బలంపై మరింత విశ్వాసం పెంచుకుంది. ఇది పార్టీ తన సొంత ఆధారాలను విస్తరించాలని, స్వతంత్రంగా అధికారం సాధించాలని భావిస్తోందని తెలియజేస్తోంది.తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం వంటి ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పొత్తులు తిరస్కరించడం రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై కీలక ప్రకటనఅమిత్ షా మరో ముఖ్యమైన విషయం చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం ద్వారా పార్టీ తన విజన్‌ను స్పష్టం చేస్తోంది.ఒంటరి పోటీ ప్రకటన తెలంగాణ రాజకీయ దృక్పథాన్ని మార్చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పొత్తు ఆశల్లో ఉన్న చిన్న పార్టీలకు ఇది ఎదురుదెబ్బ కావచ్చు. బీజేపీ తన సొంత ఓటు బ్యాంకును విస్తరించి, స్వతంత్ర శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యం స్పష్టమవుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యూహం కావచ్చు. పంజాబ్‌తోపాటు తెలంగాణను కూడా ఒంటరి పోటీ మోడల్‌గా తీసుకురావడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా తన సానుకూలతను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది.అమిత్ షా వ్యాఖ్యలు కేవలం తెలంగాణకు మాత్రమే కాకుండా, బీజేపీ జాతీయ స్థాయి రాజకీయ వ్యూహంలోని ముఖ్యమైన మార్పును తెలియజేస్తున్నాయి. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో అధికారం సాధించాలన్న లక్ష్యం దక్షిణ భారతదేశంలో పార్టీ విస్తరణకు కీలకమవుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# మమత ఫెయిల్యూర్ స్టోరీ...

### ఎందుకిలా... ఏమైంది

కోల్ కత్తా, జూన్ 11, (న్యూస్ పల్స్)మమతా బెనర్జీ 1985లో పార్లమెంట్ సభ్యురాలిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆమె ఒక మంచి పోరాట యోధురాలు, పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారం నుంచి విజయవంతంగా గద్దె దింపారు. ఆమె 2011లో ముఖ్యమంత్రి అయ్యారు, 2016లో తిరిగి ఎన్నికయ్యారు, మళ్ళీ 2021లో కూడా గెలిచారు. అయితే, 2026లో ఘోర పరాజయం తర్వాత, ఆమె పార్టీ, ఆమె వ్యక్తిగత రాజకీయ పలుకుబడి వేగంగా క్షీణించే దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. నిజాయితీపరుడు, నిష్కపటమైన వ్యక్తిగా భావించే రాజకీయ నాయకులు అధికారాన్ని కోల్పోయినప్పుడు, తరచుగా ప్రజల సానుభూతి ఉంటుంది. కానీ ఒక రాజకీయ నాయకుడు వివాదాల మధ్య ఓడిపోయి, అధికారంలో ఉన్నప్పుడు అహంకారిగా కనిపించినప్పుడు, ప్రతిస్పందన చాలా భిన్నంగా ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రత్యర్థులు ఆ పతనాన్ని వేడుక చేసుకుంటారు. స్నేహితులు కూడా రహస్యంగా దానిని స్వాగతించవచ్చు. ఈ రోజు మమతా బెనర్జీ విషయంలో ఇదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ప్రత్యర్థులు ఆనందంగా ఉన్నారు, ఆమె మాజీ మిత్రులు చాలామంది కూడా, బహిరంగంగా అంగీకరించకపోయినా, సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. బెంగాల్‌లోని చాలా మంది ఓటర్లు ఆమె నాయకత్వంపై విసిగిపోయారనడంలో సందేహం లేదు. వివాదాస్పదంగా, ఘర్షణపూరితంగా, లేదా అవినీతి, హింసతో సంబంధం ఉన్నట్లు కనిపించే రాజకీయ నాయకుల పట్ల ప్రజలు తరచుగా విముఖత చూపుతారు. మమతా బెనర్జీ తరచుగా అటువంటి వివాదాలను ఆకర్షించారు. అయితే, ముఖ్యమంత్రిగా, ప్రజలు ఆమె నుంచి హుందాతనం, సంయమనం, రాజనీతిజ్ఞతను ఆశించారు. చాలా మంది బెంగాలీలు గౌరవం, ప్రజా ప్రవర్తన వంటి విషయాల పట్ల ప్రత్యేకంగా సున్నితంగా ఉంటారు. చివరికి, వారు బ్యాలెట్ పెట్టె వద్ద ఆమెను శిక్షించారు.మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ప్రోత్సహించి ముఖ్యమైన పదవికి ఆయనే వారసుడు అనే వాతావరణాన్ని సృష్టించారు. దీంతో ఆయన షాడో సీఎంగా మారిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అభిషేక్ బెనర్జీ సమర్థవంతమైన నాయకుడిగా, వినయశీలిగా, ప్రభావవంతమైన వ్యక్తిగా భావించి ఉంటే ఈ వాతావరణాన్ని అందరూ స్వాగతించేవారు. అయితే, చాలా మంది ఓటర్లు ఆయనలో ఈ లక్షణాలు లేవని నమ్మారు. ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి కేవలం ఒక అవకాశం కోసం ఎదురుచూశారు. జనాభాలో దాదాపు 32% మైనారిటీలు ఉన్న రాష్ట్రంలో, బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నందున, మమతా బెనర్జీ ఓటమి దాదాపు అసాధ్యమని చాలామంది నమ్మారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న నియోజకవర్గాలలో తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం చెలాయించింది. మెజారిటీ తగ్గినా, మమత మళ్లీ గెలుస్తారని చాలా మంది పరిశీలకులు అంచనా వేశారు. దానికి బదులుగా, ఒక నాటకీయ పరిణామం జరిగింది. హిందూ సమాజంలోని ఒక వర్గం ఆమెకు, ఆమె రాజకీయ వైఖరికి వ్యతిరేకంగా మారిందని సమాచారం. ఫలితంగా, బీజేపీ 294 స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుని భారీ విజయాన్ని సాధించింది. ఇది ఒక అద్భుతం.మమతా బెనర్జీ పరిపాలనకు ఎప్పుడూ తగినంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. ఆమె ప్రభుత్వం రైల్వేలు, విమానాశ్రయాలు, రోడ్లు, కాలువలకు సంబంధించిన అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని లేదా అడ్డుకుందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, అనేక కేంద్ర ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు కాలేదు లేదా



ఆలస్యమయ్యాయి. ఫలితంగా, పశ్చిమ బెంగాల్ అభివృద్ధి దెబ్బతిందని చాలా మంది భావించారు. కేవలం రాజకీయాలు చాలు అని మమత అనుకుంటే, ప్రజలు మెరుగైన పాలన కోరుకున్నారు. మమతా బెనర్జీ ఓటమికి ఇలా చాలా కారణాలు ఉన్నాయి. కారణాలు ఏవైనప్పటికీ, ఈ ఓటమి నిర్ణయాత్మకమైనది. రాజకీయ పునరాగమనాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది. బహుశా మమతా బెనర్జీకి అతిపెద్ద సవాలు బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి. ఆయన ఒకప్పుడు రెండు దశాబ్దాలకుపైగా ఆమెకు సన్నిహితుడు, బలమైన క్షేత్రస్థాయి సంబంధాలున్న రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. అధికారికి బెంగాల్ రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. అనేక విధాలుగా, ఆయనను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో పోల్చవచ్చు. ఆయనకు రాజకీయ చతురత ఉంది. ఇటీవలి నెలల్లో మమతా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ఆమె మద్దతుదారులను పక్షం మార్చుకునేలా ప్రోత్సహించడానికి కృషి చేశారు. పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆమెకు దూరమయ్యారని సమాచారం. ఇది అసెంబ్లీలో ఆమె స్థానాన్ని చాలా బలహీనపరిచి, పార్టీపై ఆమె అధికారాన్ని తగ్గించింది. ఒకప్పుడు విధేయులైన మద్దతుదారులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు కూడా పార్టీని వీడటం ప్రారంభించారు. ఈ నాయకులలో కొందరు సంవత్సరాల తరబడి మమతా బెనర్జీకి అండగా నిలిచారు, కానీ ఇప్పుడు వేరే రాజకీయ మార్గాలను ఎంచుకున్నారు. పార్టీ నుంచి ముఖ్యమైన రాజకీయ అవకాశాలు పొందిన సుష్మితా దేవ్ నిష్క్రమణ చాలా పెద్ద మార్పు. ఆమె రాజీనామా తృణమూల్ కాంగ్రెస్ నుంచి పెరుగుతున్న వలసలకు ప్రతీకగా నిలిచింది. మమతా బెనర్జీని వీడే ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆమె జెండా కింద ఎన్నికయ్యారు కాబట్టి రాజీనామా చేయాలని చాలా మంది వ్యాఖ్యాతలు వాదిస్తారు. అయితే, ఈ వ్యక్తులు వారి సొంత బలాలు, ప్రజాదరణ కారణంగా ఎంపికయ్యారని కూడా వాదించవచ్చు. ఉదాహరణకు, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు స్వతంత్రంగా ఓట్లను ఆకర్షించగలరనే కారణంతో అభ్యర్థులుగా ఎంపికయ్యారు. అందువల్ల, వారి విజయం కేవలం మమతా బెనర్జీ వల్లే సాధ్యమైందని చెప్పడం పూర్తిగా సరైనది కాదు. 2011 నుంచి, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్రెస్, వామపక్ష పార్టీలను క్రమపద్ధతిలో బలహీనపరిచి, వారి రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించారు. అయినప్పటికీ, ఓటమి తర్వాత, ఆమె మద్దతు, రక్షణ కోరుతూ అవే పార్టీల వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. చాలా మంది పరిశీలకులకు, ఇది భయాందోళనను, రాజకీయ విశ్వాసం కోల్పోవడాన్ని సూచించింది. రాజకీయాలు చాలా క్రూరంగా ఉంటాయి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునేది శత్రువులు మాత్రమే కాదు. ఒకప్పుడు నిర్లక్ష్యం చేసిన లేదా అవమానాలకు గురైన మాజీ మిత్రులు కూడా పాత లెక్కలు తేల్చుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఓటమి ఒక రాజకీయ నాయకుడిలో భయాందోళన కలిగించకూడదు. అయినప్పటికీ, మమతా బెనర్జీ ఇప్పుడు బలం కన్నా భయంతోనే పనిచేస్తున్నారని చాలామంది నమ్ముతున్నారు. ఆమె ప్రత్యర్థులు ఆమె మద్దతుదారులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుండగా, మాజీ మిత్రులు ఆమె అవమానాన్ని ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తున్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు మెరుగైన సలహాదారులు అవసరమయ్యారు. నేడు, రాజకీయ ప్రతికూలతను ఎదుర్కొంటున్న నాయకురాలిగా, ఆమెకు గతంలో కంటే మెరుగైన సలహాదారులు అవసరమని చెప్పవచ్చు. భవిష్యత్తును అంచనా వేయడం ఎల్లప్పుడూ కష్టం. అయినప్పటికీ, పావెల్ ఫేమస్ కామెట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులను వెంటాడుతూనే ఉంది: "అన్ని రాజకీయ జీవితాలు వైఫల్యంతోనే ముగుస్తాయి." చరిత్రను పరిశీలిస్తే, అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకులు కూడా చివరికి ఓటమిని చవిచూస్తారని తెలుస్తుంది. చాలామంది తమ చివరి కాలంలో రాజకీయ వైభవానికి చాలా దూరంగా ఉంటారు. మమతా బెనర్జీ తన తలరాతను మార్చుకోగలరా లేదా అనేది అనిశ్చితంగానే ఉంది, కానీ ప్రస్తుతం ఆమె రాజకీయ ప్రయాణం అత్యంత క్లిష్టమైన దశలోకి ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తోంది.

## కాంగ్రెస్ లో విలీనం దిశగా తృణమూల్

న్యూఢిల్లీ, జూన్ 11 ,బీజేపీ నుండి పెరుగుతున్న రాజకీయ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి , ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని సోనియా గాంధీ ప్రతిపాదించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రముఖ నాయకుల నిష్క్రమణలు వంటి సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రతిపాదనపై వెంటనే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, ఆలోచించుకోవడానికి మమతా బెనర్జీ కొంత సమయం కోరినట్లు సమాచారం.ఈ విలీన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని, అలాగే టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీలో ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనల గురించి ఇరు పార్టీల నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు.రాజకీయ ఉత్కంఠను రేపుతున్న ఈ పరిణామాల మధ్య, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ చర్చలు చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని అభిషేక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతర పరిస్థితులపై, ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారంతృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ఇండియా కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లీ వెళ్లగానే.. కలకత్తాలో తిరుగుబాటు బావుటా ఎగిరింది. ఏకంగా 20 మంది ఎంపీలు, తాము ఎన్డీయేలో చేరేందుకు అనుమతి కావాలంటూ స్పీకర్ ఓం బిర్లాకి లేఖ రాయడం కలకలం రేగింది.అయితే.. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. యూసుఫ్ పఠాన్, సయోని ఘోష్, శత్రుఘ్న సిన్హా వంటి ప్రముఖులతో సహా దాదాపు 19 మంది ఎంపీలు తిరుగుబాటుదారుల జాబితాపై సంతకాలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో పార్టీ నిలువునా చీలిపోయే దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ దీదీకి సవాల్ గా నిలుస్తున్నాయి. బసిర్‌హత్ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాం మరణంతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, ప్రస్తుతం లోక్‌సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. అయితే, తాజా తిరుగుబాటు కారణంగా సభలో మమతా బెనర్జీకి ఉన్న వాస్తవ మద్దతు బలం కేవలం 19 మంది ఎంపీలకు తగ్గిపోయింది.తక్షణమే రాజీనామా చేయకూడదని లేదా అధికారికంగా ఃఏఖలో చేరకూడదని అసమ్మతి ఎంపీలు నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాల సమాచారం. దానికి బదులుగా, వారు ఎన్డీఏకి మద్దతునిస్తూ ఒక ప్రత్యేక వర్గంగా కొనసాగాలని యోచిస్తున్నారు; ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు భావిస్తున్న కాకోలి ఘోష్ దస్తీదార్, ఎన్డీయే కు మద్దతు ప్రకటిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తామని చెప్పారు. కనీసం 20 మంది టీఎంసీ (౧ఓఅ) ఎంపీలు స్పీకర్‌కు అధికారిక లేఖ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.లోక్‌సభలో టీఎంసీ ఛీఫ్ విప్‌గా దస్తిదార్ కొనసాగుతున్నారని స్పీకర్ ముందు వాదించే అవకాశం ఉందని అసమ్మతి వర్గం భావిస్తున్నట్లు సమాచారం; పార్లమెంటులో తలెత్తే అవకాశం ఉన్న న్యాయపరమైన మరియు విధానపరమైన పోరాటంలో ఈ వాదన కీలక అంశంగా మారవచ్చు.





## బండికి బ్రేకులు..

కరీంనగర్, జూన్ 11, (న్యూస్ పల్స్)గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్‌కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్ లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్‌లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను గెల్చుకుంది బీజేపీ. నెక్స్ట్ మా టార్గెట్ జీహెచ్ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ? ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.గత ఎన్నికల టైమ్‌లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి? అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ? ఇప్పుడు ఆ ఛాన్స్‌లేదు.



పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే?.ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్‌లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. హైదరాబాద్‌ని వదిలేసినా వరంగల్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది.

# యాక్టివ్ పాలిటిక్స్ కు మల్లారెడ్డి దూరం..?

రంగారెడ్డి, జూన్ 11, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయా ల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బి ఆర్ ఎస్) ఎన్నికల్లో పో టీ చేయవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బి ఆర్ ఎస్ అ ధిష్టానం టికెట్ ఇస్తే తన పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి బిజెపిలో చేరుతారని ఇటీవల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎంపీ తో పాటు 5 ఎమ్మెల్యే టికెట్లు ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని అడుగుతున్నారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అనుచరులు కొందరు నేరుగా మల్లారెడ్డిని ఈ విషయమై అడిగారు. తాను పోటీ చేయబోనని, టిఆర్ఎస్ టికెట్ ఇస్తే మహేందర్ రెడ్డి పోటీ చేస్తారని చెప్పారు.అంతేగాక చిన్న కుమారుడు భ ద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతారని సూటిగా చెప్పకుండా చేరుతారేమోనని అన్నారు. బిజెపిలో చేరబోనని, బి ఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పారు. మల్లారెడ్డి కోడలు ప్రీతి రె డ్డికి రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఆమె బిజెపిలో చేరుతారని పార్లమెంటుకు పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇటీవల బి ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు, సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడ్చల్, ఘట్కేసర్ తో పాటు మరోచోట సమావేశాలు జరిగాయి. వీటికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానికంగా ఉన్నప్ప టికీ సమావేశాలకు హాజరు కాలేదు. పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా హాజరయ్యారు. స్థానికంగా ఉండి సమావేశాలకు హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. బిజెపిలోకి వెళ్తున్నందున సమావేశాలకు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. మల్లారెడ్డి తీరుపై బీఆర్ఎస్ అధిష్టానం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. టిఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్ బిజెపి నేతలను కలిశారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధాని మోడీని వేసి ఆహ్వానించారు.పార్టీకి సమాచారం లేకుండా కలవడంపై అధిష్టా నం గుర్రుగా ఉంది. బి ఆర్ ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం లో ఈ విషయమై కెసిఆర్ మల్లారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి సమాచారం ఇవ్వకుండా సీఎంను కలవడంతో బిఆర్ఎస్కు చెందిన ముఖ్య నాయకులు వివాహ వార్షికోత్సవానికి గైరహాజరయ్యారు. కాంగ్రెస్కు చెందిన డి ప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ విషయమే అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. మల్లారెడ్డి నిర్ణయం వ్యూహాత్మకమా లేక నిజంగానే పోటీ చేయరా అనేది చర్చనీ అంశమైంది. వాస్తవానికి మల్లారెడ్డి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంకో టర్మ్ పోటీ చేయగలరు. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో అనుచరులకు అర్థం కా వడం లేదు. ఆరు నెలల క్రితం తాను పోటీ చేయను అని అ న్నారు. ఆ తర్వాత మళ్లీ నేను అలా అనలేదు అంటూ మాట మార్చారు. ఇప్పుడు కూడా మాట మార్చేస్తారా? నిజంగానే పోటీకి దూరంగా ఉంటారో వేచి చూడాల్సిందే!

# నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...

వరంగల్, జూన్ 11, (న్యూస్ పల్స్)ఒక్కొక్కటి రెన్యువల్ అవుతున్నాయి..! మరి మా సంగతి ఏంటి..? వాళ్ళకే అవుతాయా మాక్కూడా రెన్యువల్ చేయండి ప్లీజ్..అంటూ నేతల ముందు అప్పీల్ చేస్తున్నారు. ఇంతకి అయ్యేది ఎందరికి?హ్యాండ్ ఇచ్చేది ఎవరికి..!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 37 మంది నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. 2023 ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వాళ్లు కొందరు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఇంకొందరు ఆ లిస్ట్‌లో ఉన్నారు. వాళ్ళ పదవీకాలం జులైతో ముగుస్తుంది. అదే సమయంలో కొత్తగా పదవుల కోసం చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జూన్ వచ్చేసింది?ఇక జులై వచ్చేస్తుంది?అంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇక్కడే తేడా కొడుతోందట. పదవుల కోసం కొత్తగా ఎదురుచూస్తున్న వాళ్ళు ఎంత ఆశతో ఉన్నారో? ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఉన్న నాయకులు కూడా అంతే ఆశతో రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు 37 మంది కార్పొరేషన్ చైర్మన్స్ పని తీరుపై సీఎం రేవంత్ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ చాలా మంది పని తీరు మెరుగు పరుచుకోలేదన్న అభిప్రాయం ఉంది. పైగా వాళ్ళు ఎవరూ పార్టీ కోసం సరిగా సమయం ఇవ్వడం లేదన్న నివేదికలు సైతం సీఎం దగ్గర ఉన్నాయట. రెన్యువల్ అయ్యే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనే భావన కూడా ఉంది. ఐతే ఇటీవల టీశాట్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవుల్ని రెన్యువల్ చేసింది ప్రభుత్వం. దీంతో? మిగతా వాళ్ళలో కొందరు ?మా పదవులు మాత్రం ఎందుకు రెన్యువల్ కావన్న ధీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే? టెన్షన్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఏ లెక్కన చూసుకున్నా? ఇప్పుడున్న 37మందిలో మెజార్టీ నాయకులకైతే రెన్యువల్ ఉండకపోవచ్చునే తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని టీజీఐఐసీ చైర్మన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అలాగే?.స్పోర్ట్స్ అథారిటీ,ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ చైర్మన్ లాంటి కొన్ని పదవులకు మాత్రం రెన్యువల్స్ ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వాళ్ళలో 16 మందికి ఇంటెలిజెన్స్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయని, సదరు చైర్మన్స్ రెజుమేస్‌ను తిరిగి అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. రేవంత్ సీఎం అయినప్పటి నుండి.. పదవులు ఇచ్చే ప్రతిఒక్కరి విషయంలో పోలీసు విచారణ చేయిస్తున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు కూడా పంథా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. కొందరు కార్పొరేషన్ చైర్మన్ ల మీద ఆరోపణలు వచ్చిన క్రమంలో ఫ్రెష్ గా నివేదిక కోరినట్టు తెలుస్తోంది. ఏదేమైనా రెన్యువల్ కి సమయం దగ్గర పడుతుం డటంతో చాలా మందిలో ఐతే టెన్షన్ మొదలైందని అంటున్నారు. మళ్ళీ ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ.. నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి తోడు.. కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు కూడా ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు.

# జీహెచ్ఎంసిలో డీజిల్ దొంగలు

హైదరాబాద్,జీహెచ్ఎంసీలో దొంగలు పడ్డారు. ఇంధనం పక్కదారి పట్టిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. కానీ, ఆ దొంగలు చిక్కరూ.. దొరకరు. ఎందుకంటే వారందరూ ఇంటి దొంగలే.. తోడు దొంగలే. నగరంలో చెత్త తరలింపు వాహనాలకు జీహెచ్ఎంసీ ఉచితంగా డీజిల్ సమకూరుస్తుంది. కొంత మంది సిబ్బంది ఇక్కడే చేతివాటం చూపుతున్నారు. ఈ డీజిల్ను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ ఆరోపణలు చాలా కాలంగానే ఉన్నా.. చర్యలు మాత్రం లేవని కార్మికులు ఆరోపిస్తున్నారుచెత్త తరలింపు వాహనాల డీజిల్ ట్యాంక్ లోంచి గుట్టుగా డీజిల్ తీస్తున్న సిబ్బంది.. బహిరంగ మార్కెట్లో దాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. చాదర్ ఘాట్ జైల్ గార్డెన్ ల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై యూనియన్ నేతలు మండిపడుతున్నారు.

# గృహిణులు దేశ నిర్మాతలు.. వారికి నెలకు రూ.30,000 పరిహారం చెల్లించాల్సిందే: సుప్రీం కోర్టు

న్యూ ఢిల్లీ, దేశంలో గృహిణుల శ్రమపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహిణులు దేశ నిర్మాతలు అని, వారు చేసే పనికి కనీసం రూ.30,000 పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణించినా, వైకల్యం సంభవించినా నెలకు కనీస పరిహారం కింద ఈ మొత్తం చెల్లించాలని సూచించింది. సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సంజయ్ కరోల్, కే కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణించినా లేదా వైకల్యం సంభవించినా బాధితుల ఆదాయం వంటి వివరాల ఆధారంగా కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం అందిస్తాయి.ఈ నేపథ్యంలో ఒక కేసుకు సంబంధించి



సుప్రీం కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణిస్తే బాధితులకు నెలకు రూ.30,000 పరిహారం అందించాలని ఆదేశించింది. గృహిణులను దేశ నిర్మాతలుగా అభివర్ణించింది. వారు ఇంటి పని చేస్తూ, పిల్లల్ని, కుటుంబ సభ్యుల్ని చూసుకుంటారని, వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, అంతిమంగా దేశాభివృద్ధికి దోహదపడతారని కోర్టు అభిప్రాయపడింది. వారు ఇంట్లో చేసే పనులతో ఆదాయం సంపాదించకపోయినంతమాత్రాన వారి పనితనానినికి వెల కట్టలేమని కాదని, సగటున కనీసం రూ.30,000 చెల్లించాలని ఆదేశించింది. సాధారణంగా గృహిణులు చేసే పనులకు పరిహారం తక్కువగా వస్తుంటుంది. ఎందుకంటే ఈ పనిని ఇటు కూలీ పనిలాగా కాకుండా, అటు స్కిల్డ్, నాన్ స్కిల్డ్ పనిలాగా కాకుండా చూస్తారు.అందుకే పరిహారం విషయంలో గృహిణులకు తగిన న్యాయం జరగడం లేదు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలకు అనుగుణంగా ఇకపై గృహిణులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రతి నెలా కనీస పరిహారం అందే అవకాశం ఉంది. 2001లో పంజాబ్‌లో ఒక మహిళ రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఆమె తరఫున పరిహారం కోరుతూ భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అనంతరం ఈ అంశం వివిధ కోర్టుల్లో విచారణ జరుగుతూ.. చివరికి సుప్రీంకోర్టు వరకు చేరింది. తాజాగా కోర్టు వారికి అనుకూలంగా, పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

## బీజేపీ ఇప్పుడు ఓటు చోరీ కాదు.. సీటు చోరీ చేస్తోంది: కేసీ వేణుగోపాల్



ఢిల్లీ, జూన్11, : దేశ సమస్యలు, విద్యావ్యవస్థలో లోపాలపై రానున్న రెండు, మూడు నెలలపాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు, ప్రచారాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలకు ప్రధాని మోదీ వెంటనే సమాధానం చెప్పాలని అన్నారు. మోదీ సర్కార్‌లో ప్రజలు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయిని ఆరోపించారు. ఢిల్లీ ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై కాంగ్రెస్ అగ్రనేతలు చర్చించారు. మూడు గంటల పాటు సుదీర్ఘంగా ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశంలో చర్చించిన విషయాలపై మీడియాతో కేసీ వేణుగోపాల్ మాట్లాడారు.దేశవ్యాప్త ఆందోళనలు, ప్రచారాలకు సంబంధించి మూడు, నాలుగు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో పరిస్థితులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని విమర్శించారు. కోర్టు నోటీసు ఆధారంగా చేసుకుని ఎఫ్ఐఆర్ లేకపోయినా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ధ్వజమెత్తారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్ పత్రాలు సరిగా నింపకపోయినా ఆ నామినేషన్ అంగీకరించారని ఆగ్రహించారు. లోపాలున్నా బీజేపీ అభ్యర్థి నామినేషన్ స్వీకరించి.. ఎఫ్ఐఆర్ నమోదు కానీ కేసును సాకుగా చూపిస్తూ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మండిపడ్డారు.దేశంలో ప్రజాస్వామ్యం దయనీయ పరిస్థితుల్లో ఉందని కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ గురించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే కార్యాలయం లోపలికి ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని అన్నారు. ఇతర పార్టీల్లో గెలిచిన ఎంపీలను బీజేపీ ఎంపీలుగా మార్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు ఓటు చోరీకి పాల్పడిన బీజేపీ ఇప్పుడు సీటు చోరీకి పాల్పడుతోందని ఆక్షేపించారు. దేశంలో ఉన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించామని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, ఆర్థిక సంక్షోభం అంశాలపై మాట్లాడామని తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా కేంద్రప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం బాగా పెరిగిపోతుందని చెప్పుకొచ్చారు.దేశ యువత భవిష్యత్తు ఆందోళనలో ఉందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. పేపర్ లీకుల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రంగా ప్రభావితం అయ్యారని చెప్పారు. నీట్ పరీక్ష లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి కనీసం నైతిక బాధ్యత కూడా వహించడం లేదని ఆగ్రహించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీక్ అంశాలు దేశంలో ఇప్పుడు ఉన్న ప్రధాన సమస్యలని ప్రస్తావించారు. రానున్న రెండు, మూడు నెలల్లో విద్యావ్యవస్థ లోపాలపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతోందని... కానీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల మన రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఆందోళనల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. మధ్యప్రదేశ్ హోంమంత్రి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కూర్చుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

# బోణీ కొట్టిన బీజేపీ.. మధ్యప్రదేశ్ నుంచి మూడు స్థానాలు కైవసం..

భోపాల్: రాజ్యసభ ఎన్నికలు–2026లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బోణీ కొట్టింది. మధ్యప్రదేశ్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలను కమలం పార్టీ కైవసం చేసుకుంది. బీజేపీ అభ్యర్థులు రజనీశ్ అగర్వాల్, తరుణ్ చుగ్, మహేశ్ కేవత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. గెలుపొందిన అభ్యర్థులకు మధ్యప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోవడానికి నేడే(జూన్ 11) చివరి రోజు. అయితే, ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అయితే, నటరాజన్‌పై తెలంగాణలో క్రిమినల్ కేసు నమోదు అయ్యిందని.. ఆ విషయాన్ని నామినేషన్ పత్రాల్లో ఆమె వెల్లడించలేదని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ ఆరోపించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో అన్ని విషయాలు తెలియజేయాలని.. కానీ, ఉద్దేశపూర్వకంగానే నటరాజన్ కేసు విషయాన్ని దాచారని ఆయన వివరించారు. దీంతో గత మంగళవారం నాడు నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ మేరకు ఎన్నికలకు వెళ్లకుండానే బీజేపీ ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.కాగా, 10 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జూన్ 1న ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్–4, గుజరాత్–4, కర్ణాటక–4, మధ్యప్రదేశ్–3, రాజస్థాన్–3, ఝార్ఖండ్–2 స్థానాల చొప్పున ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

# 'ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు'




కట్టంగూర్, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంచుకుంటున్నారని కట్టంగూర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కొంక ఆంటోని అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ముత్యాలమ్మగూడెం, బిల్లంకానిగూడెం, కమ్మగూడెం, చవుళ్లగూడెం, మాణిక్యాలమ్మగూడెం గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 100 కొత్త అడ్మిషన్లు చేర్పించేందుకు లక్ష్యంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. జూన్ 15 నుండి పాఠశాలలు పునః ప్రారంభవుతాయని తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటి రోజు నుండే పాఠశాలలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అబ్దుల్ గఫూర్, చిన్ని శ్రీనివాస్, చిన్న చంద్రయ్య, లోహిత్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


## ముగ్గురు మంత్రులుంటే ఒక్కరు కూడా స్పందిస్తలేరు.. ఖమ్మం ఘటనపై ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



ఖమ్మంలో ఒక 12 ఏళ్ల బాలికపై తండ్రి వయసున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడడం అత్యంత దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఈ విషయమై ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఆ బాలిక పురుషులైన డాక్టర్లను కూడా దగ్గరికి రానివ్వడం లేదని వైద్యులు చెప్తున్నారంటే, ఆ బాలిక ఎంత భయపడిందో అర్థం చేసుకోవచ్చన్నారు.మగవాళ్లెవరైనా హెచ్‌వోడీస్ కానీ, ఆర్ ఎంవోలు కానీ ,డాక్టర్లు కానీ వస్తే బాలిక భయభ్రాంతులకు లోనవుతుంది. అంటే అంత ఘోరంగా ఆ చిన్న అమ్మాయిని చిత్రహింసలు పెట్టారని అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై ఎందుకు స్పందిస్తలేదని అడిగారు. ఈ రోజు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో మహిళలకు రక్షణ కరువైపోయిందన్నారు. ఇప్పుడున్న పరిస్థితి చూస్తే ఆడపిల్లలను ఈ ప్రభుత్వం పట్టించుకున్నట్టు అనిపిస్తలేదన్నారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఒక్కరు కూడా స్పందించడం లేదు. ఆ పక్కనే ఉన్న వరంగల్‌లో ఉన్న ఇద్దరు మహిళా మంత్రులు కూడా స్పందిచలేరని మండిపడ్డారు, ఒక బాలికకు ఇలా జరిగితే.. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మహిళా మంత్రులు ఒక్కరు కూడా ఎందుకు స్పందించడం లేదు.? ప్రభుత్వం వెంటనే స్పందించి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి.. మరో ఇద్దరికి గాయాలు

దామెర : దామెర మండలం ఓగులాపూర్ వద్ద టిప్పర్, వాటర్ ట్యాంకర్ ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడెపాడ్ నుంచి వరంగల్ వైపు రాంగ్ రూటులో



రోడ్డు పక్కన ఉన్న చెట్లకు నీరు పోస్తూ వస్తున్న వాటర్ ట్యాంకర్ ( వరంగల్ నుంచి గుడేపాడు వైపు వెళ్తున్న టిప్పర్ వాహనాన్ని ఢీ కొంది.ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ (45) అక్కడికక్కడే మృతిచెందగా రంగారెడ్డి జిల్లా నవాబుపేటకు చెందిన మాదారం గోపాల్(32), జార్ఖండ్ రాష్ట్రం పోచమ్మ గ్రామానికి చెందిన కార్తీక్ (25)కు తీవ్ర గాయాలయ్యాయి. తెలియాల్సి ఉంది. ఘటన స్థలాన్ని శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి, దామెర ఎస్సై కొంక అశోక్ సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తండ్రి ప్రాణాలు తీసిన నాటుకోడి కూర

జనగామ,నాటుకోడి విషయంలో తలెత్తిన గొడవ లో వ్యక్తి మృతి చెందాడు. కోడికూర ఘర్షణలో తండ్రిపై కొడుకు రోకలిబండతో దాడికి దిగాడు. తండ్రి రమేష్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి గ్రామంలో ఘటన జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నాటుకోడి తెచ్చి భార్యను కూర వండమని రైతు జంగిలి రమేష్ చెప్పాడు. రాత్రి అవుతుంది వద్దని భర్తకు భార్య నచ్చచెప్పింది. దాంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తన తల్లిని ఎందుకు తిడుతున్నావని తండ్రిని కుమారుడు గణేష్ ప్రశ్నించాడు. నన్నే ప్రశ్నిస్తావా.. అంటూ కొడుకు గణేష్ ను చంపపై తండ్రి రమేష్ కొట్టాడు. క్షణికావేశానికి గురైన గణేష్ పక్కనే ఉన్న రోకలిబండతో తన తండ్రిపై తలపై దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయిన రమేష్ . ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# వామపక్షాల దారెటు...

విజయవాడ, జూన్11, తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష భావజాలం కాస్తా పక్కదారి పట్టినట్టు కనిపిస్తోంది. మొన్నటి ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో కూడా ఇది స్పష్టమైంది. ఇప్పుడు తాజాగా విశాఖపట్నంలో వామపక్షాల నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. రాజకీయ ప్రేరేపితం అన్నట్టు వారి ప్రవర్తన ఉంది. కూటమి వచ్చిన తర్వాత వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలకు కొంత స్వేచ్ఛ వచ్చిన మాట వాస్తవం. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కనీసం నోరు తెరవ లేకపోయారు వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు. అంతలా ఉక్కు పాదం మోపారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇప్పుడు కూటమి వచ్చిన తర్వాత స్వేచ్ఛ ఇస్తే.. మరోలా మాట్లాడుతున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి వామపక్షాలను ఎంతలా చూశారో అందరికీ తెలిసిన విషయమే.. ఇప్పుడు వారిద్దరి పార్టీలకు మైలేజ్ వచ్చేందుకు ఇదే వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రయత్నిస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది.వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు అంటే ముందుగా గుర్తొచ్చేది సమస్యల పరిష్కారం. కార్మికులతో పాటు ఉద్యోగులు వామపక్షాలను ఆశ్రయిస్తారు. ఎందుకంటే వారు పోరాటం చేస్తే ఏదో ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ. అయితే ఇప్పుడు వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ ప్రేరేపితం అనే చట్రంలో చిక్కుకుంటున్నాయి. లేనిపోని వివాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారం మరిచి.. మరింత జఠిలం చేస్తున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు సంబంధించి.. బాధితుల పరామర్శకు వెళ్లిన.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి లోకేష్ పై నిలదీసినంత పని చేశారు. ఆయన సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. చనిపోయింది మీ కుటుంబాలు వారు కాదు కదా? బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ.. విరుచుకు పడే దాకా పరిస్థితి వచ్చింది.ఇప్పుడు అనవసరంగా విశాఖకు చెందిన వామపక్షాల నేతలు ట్రోల్ అవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. నాడు జగన్ సర్కార్ నోరు తెరవలేదు. కనీసం ప్రైవేటీకరణను నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఎప్పుడైతే బిజెపితో టిడిపి, జనసేనకు పొత్తు కుదిరిందో.. నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం యూటర్న్ తీసుకుంది. ప్రైవేటీకరణ ఆగింది. 13 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ సమకూరింది. వైసీపీ హయాంలో కొందరు వామపక్షాల నేతలు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు వైసీపీ నేతలతో. కానీ ఇప్పుడు మాత్రం బాధ్యతగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది. కేంద్ర ఉక్కు శాఖ పర్యవేక్షిస్తుంది. మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు వైసీపీ ట్రాప్ లో పడి వామపక్షాల నేతలు సమస్యలకు పరిష్కారం చూపించాల్సింది పోయి? తామే సమస్యలను సృష్టిస్తున్నారు. వారికి ఉన్న మంచి పేరును చెడగొట్టుకుంటున్నారు

# ఫీల్ గుడ్ తప్ప.. ఫీల్డ్ లో బ్యాడే

గుంటూరు, జూన్11, పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా? మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే?లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది.అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో గ్రూప్స్ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా?అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలన్న టార్గెట్తో? ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే? తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో? ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే?. అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐఆర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

కర్నూలు, జూన్11, 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే? 2019లో అసెంబ్లీకి, లోక్సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే? పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విబేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ? 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్సభ నియోజకవర్గాలకుగాను కూటమి12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో? ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే? మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది.కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే? అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ. ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నట్టు అధిష్టానం దగ్గర కూడా నివేదికలు ఉన్నాయట. ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్న నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇటీవల సమీక్షించిన చంద్రబాబు ఒక హెచ్చరిక కూడా పంపారట. నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో నేరుగా చెప్పి స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా సరే? కొందరి తీరు మారడం లేదనే అభిప్రాయం కూడా పెరుగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో అందర్నీ సెట్ చేయాలంటే? కుప్పం తరహా ట్రీట్ మెంట్ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అందులోనూ?. మా నియోజకవర్గంలోనే కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఆల్రెడీ ప్రచారం మొదలుపెట్టేశారట. అలాంటి వాళ్ళంతా స్థానిక పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. కుప్పం తరహా ట్రీట్మెంట్ ఒక్కరికి ఇచ్చినా? మిగతా నియోజకవర్గాలన్నిటిలో ఎక్కడి వాళ్ళు అక్కడ సెట్ అవుతారన్న అభిప్రాయం పెరుగుతోంది.

# టీజీ వర్సెస్ బైరెడ్డి

## లేటెస్ట్ గా వెంకటేష్ ఎంట్రీ

కర్నూలు, జూన్ 11, కర్నూలు రాజకీయాలు వేడెక్కాయి. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన వివాదంలోకి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. సిద్ధార్థ్ రెడ్డి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలంటూ టీజీ వెంకటేష్ పరోక్షంగా హెచ్చరించారు. ఆయన తాత తనకు బాగా పరిచయమని.. ఆ పరిచయంతోనే మంచిగా మాట్లాడేది నేర్చుకోమని చెప్తున్నానని సలహా ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే తాము ఊరుకున్నా.. తమ కార్యకర్తలు నాలుక కట్ చేస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు.రాయలసీమ రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి, టీజీ కుటుంబానికి మధ్యన మాటల యుద్ధం నడుస్తోంది, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వర్సెస్ టీజీ భరత్ గా మొదలైన కర్నూలు రాజకీయం.. ఇప్పుడు మరో టర్న్ తీసుకుంది. ఇందులోకి మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. టీజీ భరత్, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మొదలైన ఈ సవాళ్లు- ప్రతి సవాళ్లలోకి టీజీ వెంకటేష్ ప్రవేశించారు. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎగిరెగిరి పడినవాళ్లంతా చల్లారిపోయారని.. మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని టీజీ వెంకటేష్ హెచ్చరించారు."కొంతమంది అప్పుడప్పుడూ ఎగిరిపడుతుంటారు. ఇటీవలే ఒకడు ఎగిరిపడ్డాడు. ఆ అబ్బాయికి సంవత్సరం కిందటే ఓసారి మాటల్లో చెప్పా. నీ పేరు అందరికీ తెలిసింది. భవిష్యత్తు బాగుంటుంది. జాగ్రత్తగా మాట్లాడి, నోరుపారేసుకోకుండా బాగా మాట్లాడేది నేర్చుకోమని చెప్పా. ఎక్కడో వారిపై ప్రేమ ఉండేది. ఎందుకంటే వాళ్ల తాత నాకు క్లోజ్. చాలా సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నాం. ఆ పరిచయాలతోనే చెప్పా. కుటుంబంలో నికృష్టుడు పుడుతుంటారు. మంచి కుటుంబాల్లోనూ దరిద్రులు పుడుతుంటారు. అలాంటి వారికి బుద్ధి చెప్పే విధానాలు వేరుగా ఉంటాయి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ఇలా చూస్తాం."" రాయలసీమలో మీసాలు తిప్పుకున్నోళ్లంతా, మీసాలు దింపుకుని మాతో సహకరించారు. ఏదో వందమంది రౌడీలను వేసుకుని ఎగిరిపడుతున్నారు. ఆ పిల్లోడికి చెప్పేదొక్కటే. వాళ్లు 100 మందిని తెస్తే మేము వేయిమందిని తెస్తాం. వాళ్లు వేయిమందిని తెస్తే మేము పదివేల మందిని తేగలం.. 10 వేల మందిని తెస్తే.. లక్ష మందిని తెస్తాం. వాళ్లు లక్ష రూపాయలు ఖర్చుచేస్తే.. నేను కోటి రూపాయలు ఖర్చు చేయగలను. నోరు పారేసుకుంటే మేమేమీ చేయకపోయినా.. మా కార్యకర్తలు ఎవరో ఒకరు నాలుక కట్ చేస్తారు.. జాగ్రత్తగా ఉండాలి" అంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి టీజీ వెంకటేష్ వార్నింగ్ ఇచ్చారు.కర్నూలు చెందిన సతీష్ అనే దళిత యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సతీష్ కుటుంబానికి ఓ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపించటంతో ఈ వ్యవహారం మొదలైంది. సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని అడుగుతున్నందుకు అధికార పార్టీ తనను బెదిరిస్తోందన్న బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి.. ఈ క్రమంలోనే టీజీ భరత్ మీద అవినీతి ఆరోపణలు చేశారు. అయితే బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి టీజీ భరత్.. సిద్ధార్థ్ రెడ్డిని జోకర్ అంటూ విమర్శించారు. సిద్ధార్థ్ రెడ్డి మీద పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చిన టీజీ వెంకటేష్.. నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు



# రూట్ మార్చిన కొల్లగట్ల...

విజయనగరం జూన్ 11,విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు మాజీ డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోలగట్ల వీరభద్రస్వామి సొంత పార్టీ వైసీపీ నాయకులకైతే ఆయన అంతరంగం అంతుచిక్కక గందరగోళ పడుతున్నారట. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్గా కనిపించే స్వామి. ఇప్పుడు ఎందుకు గడప దాటటం లేదు? యాక్టివ్గా కనిపించడం లేదంటూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ క్రమంలోనే? కొన్ని కొత్త సంగతులు తెలుస్తున్నాయట. మాజీ డిప్యూటీ స్పీకర్ తన వారసురాలి రాజకీయ భవిష్యత్ విషయమై ఆందోళనగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే ఒకడుగు వెనక్కేస్తున్నారన్నది ఇంటర్నల్ టాక్. ఒకప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సమావేశాలు, నిరసనలు అంటూ నిత్యం ప్రజల మధ్యనే కనిపించేవారాయన. కానీ కొంతకాలంగా రాజకీయంగా నెమ్మదించారన్నది జిల్లాలో ఉన్న విస్తృతాభిప్రాయం. దాంతో గతంలో కనిపించినంత చురుగ్గా ఎందుకు లేరంటూ పార్టీ వర్గాలు సైతం సమాధానాలు వెదికే ప్రయత్నంలో ఉన్నాయి. తన సహజ శైలికి భిన్నంగా ప్రస్తుతం పార్టీ కార్యక్రమం ఉంటే హాజరవుతున్నారు. నాయకత్వం పిలిస్తే ముందుకొస్తున్నారు తప్ప యాక్టివ్ రోల్ తీసుకోవడం లేదు.అయితే ఈ మౌనం వెనుక ఉన్నది రాజకీయ వ్యూహమా? లేక కుటుంబ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనలా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానంగానే వినిపిస్తోంది వారసత్వ వ్యవహారం. తన కుమార్తె శ్రావణి రాజకీయ భవిష్యత్తుపై కోలగట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఆమె గతంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు కూడా నిర్వహించినందున ఇక మీదట తనకు బదులుగా కుమార్తెను పొలిటికల్గా ప్రమోట్ చేయాలని భావిస్తున్నారట. ఆమె రాజకీయ భవిష్యత్కు బాటలు వేసే క్రమంలోనే? వైసీపీ అధిష్టానం మీద వత్తిడి తెచ్చేలా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్నది లోకల్ టాక్. ముఖ్యంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై కోలగట్ల కన్నుపడిందని అంటున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తె శ్రావణిని పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలని, ఆ మేరకు ఇప్పుడే తనకు హామీ ఇవ్వాలని వీరభద్రస్వామి పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఛాన్స్ దొరికినప్పుడే ఉపయోగించుకుంటూ? తాను పాలిటిక్స్లో యాక్టివ్గా ఉన్నప్పుడే కుమార్తె భవిష్యత్కు బాటలు వేయాలని అనుకుంటున్నారట కోలగట్ల. అందుకే పార్టీ అధిష్టానం నుంచి హామీ కోరుతూ? ఆ విషయంలో క్లారిటీ వచ్చేదాకా కామ్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పార్టీ నాయకత్వం మాత్రం అలాంటి హామీలకు ఇది సమయం కాదని అంటున్నట్టు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో క్లారిటీ లేదు. అప్పటికి రాజకీయ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

# జగన్ కొత్త టీమ్...

నెల్లూరు, జూన్ 11, జగన్మోహన్ రెడ్డికి ఒక కోర్ టీం ఉంది. చాలా దగ్గరగా మెలిగే ఒక బృందం ఉంది. ఆయన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉంటుంది. ఆయన రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కోర్ కమిటీ లో కీలక వ్యక్తులు చేరుతూ వచ్చారు. నాగేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉండేవారు. కృష్ణమోహన్ రెడ్డి ఓ ఎస్ డి గా వ్యవహరించేవారు. సీఎంగా మారిన తర్వాత ధనుంజయ రెడ్డి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు. సజ్జల రామకృష్ణారెడ్డి సలహాదారుడిగా మెలిగారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే గట్టి మద్దతుదారుడిగా నిలిచారు. కానీ తాజాగా వీరందరినీ పక్కనపెట్టి కొత్త టీం ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన కలత చెందారట. చుట్టూ వీరిని ఉంచుకొని రాజకీయాలు చేయలేనని భావించి.. కొత్త టీం ను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారట.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ పై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. వారి తీరుతోనే పార్టీ నేతలకు అధినేతకు మధ్య గ్యాప్ వచ్చిందని విమర్శలు వచ్చాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోర్ టీం పై అనేక రకాల ఫిర్యాదులు ఉన్నాయి. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఇవి సహజం అని చాలా లైట్ తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అటు అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ కోర్ టీం కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయింది. అయితే తనకు అండగా నిలిచినందునే ప్రభుత్వం టార్గెట్ చేసిందని భావించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయో అప్పటినుంచి ఆలోచనలో పడ్డారు.సాధారణంగా అధికార పార్టీ అంటేనే అవినీతి అనేది ఉంటుంది. ఆ ఆరోపణలు కూడా వస్తుంటాయి. అదే మాదిరిగా తన చుట్టూ ఉన్న కోర్ టీం పై అవినీతి ఆరోపణలు వచ్చి ఉంటాయని జగన్మోహన్ రెడ్డి భావించారు. కానీ ఒక్కొక్కరి అక్రమ సంపాదనను ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెడుతోంది. మరోవైపు కేంద్ర సంస్థ ఈడీ సైతం వెల్లడిస్తోంది. తన వ్యక్తిగత సహాయకుడి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడేసరికి జగన్ సైతం ఆశ్చర్యపోయారట. తాను ఎంతో నమ్మిన అధికారులుగా తన వద్ద పెట్టుకున్న వారు సైతం భారీగా పోగేసుకోవడాన్ని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అయితే అత్యంత వీర విధేయుడుగా మెలిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ సంపాదన చూసి ఆశ్చర్యపోయారట. సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరం చేతికి మట్టి అంటకుండా చేసిన దోపిడీ గురించి తెలుసుకొని జగన్ బాధపడ్డారట. ఇంతకాలం ఇటువంటి వారిని చుట్టూ పెట్టుకున్నానా? అని బాధపడుతున్నారట. అందుకే కోర్ టీం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారట.వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆ సమయానికి తన చుట్టూ ఉన్న టీం ను మార్చే పనిలో ఉన్నారట. గతంలో విజయసాయిరెడ్డి ఉండేవారు. ఆయన సైతం బయటకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు నమ్మకస్తులుగా భావించిన కోర్ టీం నట్టేట ముంచెయ్యడంతో జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్ కొత్త టీం లో ఎవరు చేరుతారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ కోర్ టీంలో ఎవరు చేరుతారు? అనే సందేహాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.



# జననాల రేటు తగ్గించేస్తున్న స్మార్ట్ ఫోన్లు - ఐఫోన్ రాక తర్వాత-షాకింగ్ రిపోర్ట్..!




**ఐఫోన్లతో తగ్గిపోతున్న జననాల రేటు**

సాధారణంగా జీవన ప్రమాణాలు మెరుగుపడేకొద్దీ సమాజంలో జనన రేట్లు తగ్గడం సహజం. అయితే, గత రెండు దశాబ్దాలలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఆర్థిక, సామాజిక పరిస్థితులతో సంబంధం లేకుండా, 2007 తర్వాత ప్రపంచవ్యాప్తంగా జనన రేట్లు దాదాపు ఒకే తీరులో తగ్గుముఖం పట్టాయి. ఈ మార్పుకు అసలు కారణమేమిటని ఆరా తీయగా, ఐఫోన్ల వినియోగమే మూల కారణమని రెండు కీలక అధ్యయనాలు పేర్కొన్నాయి. 'నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్' ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, అమెరికాలో 1980 నుండి 2007 వరకు ప్రతి 1,000 మంది మహిళలకు 65 నుండి 70 జననాలతో సంతానోత్పత్తి రేటు స్థిరంగా ఉంది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా పడిపోయింది. 2024 నాటికి ఇది 54కు చేరింది. అంటే 17 ఏళ్ల వ్యవధిలో ఏకంగా 22 శాతం క్షీణత నమోదైంది.

అయితే, జనన రేట్లపై ఐఫోన్ ప్రభావాన్ని అంచనా వేయడం సంక్లిష్టమైన అంశం. 2008 ఆర్థిక సంక్షోభం వంటి అనేక ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. పరిశోధకులు 2007 నుండి 2011 మధ్య కాలంలో, ఐఫోన్ కేవలం 'ఏటీ&టీ' ద్వారా మాత్రమే లభించినప్పటి డేటాను ఒక సహజ ప్రయోగంగా ఉపయోగించుకున్నారు. దీని ద్వారా ఐఫోన్ కనెక్టివిటీ ఉన్న మరియు లేని ప్రాంతాలను వారు పోల్చి చూశారు. 15 నుండి 19 ఏళ్ల వయసు గల మహిళల్లో జననాలు 4.5 నుండి 8 శాతం వరకు, 20 నుండి 24 ఏళ్ల వారిలో 3.2 నుండి 6.6 శాతం వరకు తగ్గినట్లు ఈ పరిశోధనలో గమనించారు. 2007-2011 మధ్య కాలంలో 15-44 ఏళ్ల మహిళల్లో నమోదైన జనన క్షీణతకు, ఐఫోన్ వినియోగమే 33 నుండి 52 శాతం కారణమని ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

**తగ్గిపోతున్న పర్సనల్ టైమ్**

2007-2024 మధ్య కాలంలో, 15-19 ఏళ్ల వయసు వారిలో జనన రేట్లు 70 శాతం, 20-24 ఏళ్ల వారిలో 47 శాతం తగ్గాయి. అయితే 30-34 ఏళ్ల వారిలో కేవలం 7 శాతం మాత్రమే తగ్గుదల కనిపించగా, 35-39 ఏళ్ల వారిలో జనన రేటు ఏకంగా 14 శాతం పెరిగింది. ఏటీ&టీ నెట్‌వర్క్ లేని ప్రాంతాలతో పోలిస్తే, నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాలలో కౌమార జననాలలో గణనీయమైన మార్పు కనిపించింది. మరి ఐఫోన్ నిజంగా ప్రభావితం చేసిందా? ఐఫోన్ మాత్రమే ఏకైక కారణం కాకపోయినా, ఇది కీలక పాత్ర పోషించి ఉండవచ్చు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడంతో, ప్రజలు భౌతిక ప్రపంచంలో గడిపే సమయం తగ్గిందని, అశ్లీల చిత్రాల వీక్షణ పెరగడం దీనికి ఒక కారణంగా ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. గూగుల్‌లో 'జూనీతీని' అనే పదం కోసం సెర్చ్‌లు రెట్టింపు అయ్యాయి.అంతేకాకుండా, గర్భధారణను నివారించే పద్ధతులు, గర్భస్రావంపై సమాచారం సులభంగా అందుబాటులోకి రావడం కూడా ఈ క్షీణతకు దోహదపడి ఉండవచ్చు. సిన్సినాటి విశ్వవిద్యాలయ ఆర్థికవేత్తల అధ్యయనం 128 దేశాల డేటాను పరిశీలించగా, భిన్నమైన పరిస్థితులు ఉన్న దేశాల్లోనూ ఒకే సమయంలో ఇటువంటి మార్పులు చోటుచేసుకోవడం వెనుక 'సాధారణ ప్రపంచ సాంకేతిక ప్రభావం' ఉందని గుర్తించారు. ఇరాన్, కోస్టారికా, గ్వాటెమాల, చిలీ, మెక్సికో, టర్కీ వంటి దేశాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం భారీగా పెరిగినప్పుడే కౌమార జనన రేట్లు తగ్గడం గమనించారు. అదేవిధంగా, ప్రత్యక్ష సామాజిక సంభాషణలు రోజుకు 68 నిమిషాల నుండి 38 నిమిషాలకు పడిపోగా, కంప్యూటర్ వినియోగ సమయం 22 నుండి 96 నిమిషాలకు, అంటే ఏకంగా 336 శాతం పెరిగింది.

**వివిధ దేశాల్లో ఇలా**

ఐఫోన్ మాత్రమే కారణం కాదని పరిశోధకులు స్పష్టం చేసినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా జనన రేట్లు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. అమెరికాలో జనన రేట్లు కనిష్ట స్థాయికి చేరాయి. కెనడాలో 2024లో 1.25గా ఉన్న జనన రేటు, జపాన్, స్పెయిన్ వంటి దేశాల తరహాలోనే తక్కువగా నమోదైంది. ఆసియాలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు కూడా జనాభా తగ్గుదలను ఎదుర్కొంటున్నాయి. చైనా తన 'వన్-చైల్డ్' విధానాన్ని ఎత్తివేసినా, జపాన్, దక్షిణ కొరియా తీసుకుంటున్న ఆర్థిక ప్రోత్సాహకాలు అంతగా ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఉప-సహారా ఆఫ్రికాలో జనన రేట్లు ఇంకా ఎక్కువగా ఉన్నా, భారతదేశం, బ్రెజిల్ వంటి మధ్య ఆదాయ దేశాల్లో వేగంగా క్షీణత కనిపిస్తోంది.

# అరటి పండ్లు రోజూ తింటున్నారా..!?



అరటి పండ్లు పోషకాహారంలో భాగంగా తీసుకుంటారు. ఇందులో :6, విటమిన్ అ పుష్కలంగా ఉంటాయి. మెగ్నీషియం, పొటాషియం మాంగనీస్, ఫైబర్ లు అరటి పండులో మెండుగా ఉంటాయి. అరటి పండ్లు మంచి శక్తి వనరు. అరటిపండ్లలో సహజ కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్) సమృద్ధిగా ఉంటాయి. రోజూ ఒక అరటిపండును నెల రోజులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఊహించని ఫలితాలు కలుగుతాయి. అయితే, ప్రతీ రోజూ అరటి పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదా? కాదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. దీని పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. అరటి పండును మితంగా తింటే సమస్య ఉండదని డాక్టర్లు చెబుతారు. అరటిపండ్లలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వాటిలో ఉండే పెక్టిన్ జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. అరటిపండ్లలో పొటాషియం కూడా అధికంగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అరటిపండ్లు ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లాన్ని అందిస్తాయి. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ంశ్రీబనీ ఖీవజీట ఫ్రిజ్ లో పెట్టిన కోడిగుడ్లను తింటున్నారా..!? మరిన్ని కనుగొనండి ఆరోగ్య చిట్కాలు టెక్నాలజీ గాడ్జెట్లు ట్రావెల్ గైడ్స్ తాజా తెలుగు వార్తలు వ్యాపార వార్తలు మితంగా తీసుకుంటే ప్రయోజనాలు అరటి పండు మంచి మానసిక స్థితిని కాపాడుకోవడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సెరోటోనిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పొటాషియం, మెగ్నీషియం కండరాలను బలంగా ఉంచడంలో, తిమ్మిరిని తగ్గించడంలో సహాయపడతాయి. అరటిపండ్లు ఎక్కువగా తినడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. ఇది మూత్రపిండాల సమస్యలు, గుండె క్రమరాహిత్యాలకు కారణమవుతుంది. కానీ ఇది చాలా అరుదు. అయితే అరటి పండ్లు మూత్రపిండ రోగులకు ప్రమాదం. డయాబెటిక్(సుగర్) ఉన్నవారు అరటి పండ్లను తినొద్దు. ఇందులో ఉండే ఫ్రక్టోజ్ రక్తంలో చెక్కర స్థాయిలను పెంచుతుంది. చెక్కెర స్థాయిలు పెరిగితే దానివల్ల ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. షుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉన్నవారు వీటి జోలికి పోకపోతేనే మంచిది. నార్మల్ లెవెల్స్ మెయింటేన్ చేసేవారు ఎక్కవగా పండని, దోరగా ఉన్న పండును ఉదయం సగం, సాయంత్రం సగం తినొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో కొవ్వులు ఏమీ ఉండవు.

# వారం పాటు బీట్ రూట్ జ్యూస్ తాగితే.. బీపీతో సహా ఈ సమస్యలకు చెక్..!!

బీట్‌రూట్. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. హృదయ ఆరోగ్యాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది. బీట్‌రూట్ రసం అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిలో ఉండే ఎరుపు రంగు కారణంగా ఇది రక్తహీనత ఉన్నవారికి చాలా మేలు చేస్తుందని అంటారు. బీట్ రూట్ ను జ్యూస్ చేసుకుని ప్రతి రోజూ తీసుకుంటూ ఉంటే శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయని చెబుతారు. వారం పాటు ఈ జ్యూస్ తాగితే శరీరం లో వచ్చే మార్పుల పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. బీట్‌రూట్‌లో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్తనాళాలను విస్తరింపజేయడానికి సహాయ పడతాయి. రక్తనాళాలు విస్తరింపజేసి నప్పుడు, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, దీనివల్ల గుండెపై భారం తగ్గుతుంది. ఒక అధ్యయనం ప్రకారం ఒక వారం పాటు క్రమం తప్పకుండా బీట్‌రూట్ రసం తాగడం వల్ల రక్తపోటు 5-10 ఎఎఊణ వరకు తగ్గుతుందని తేల్చారు. బీట్‌రూట్ లో బీటాలైన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఈ సమ్మేళనం ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక అధ్యయనంలో, బీట్‌రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వాపుకు కీలక సూచిక అయిన సి-రియాక్టివ్ ప్రోటీన్ తగ్గుతుందని కనుగొన్నారు. వాపు తగ్గడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది, కీళ్ల నొప్పులు తగ్గుతాయి, జీవక్రియ పెరుగుతుంది. ఒక వారం పాటు బీట్‌రూట్ రసం తాగడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**అరటి పండ్లు రోజూ**



**తింటున్నారా..!?**

**వైద్యుల సలహా మేరకు**

బీట్‌రూట్ లోని సమ్మేళనాలు గ్లూటాథియోన్‌ను పెంచడం ద్వారా కాలేయాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. గ్లూటాథియోన్ అనేది ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, ఇది శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది. బీట్‌రూట్ రసం తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి, మెదడుకు రక్త ప్రవాహం పెరుగుతుంది. బీట్‌రూట్ రసంలోని పీచుపదార్థం ప్రీబయోటిక్‌గా పనిచేస్తుంది. ఇది పేగులలోని లాక్టోబాసిల్లస్ వంటి మంచి బ్యాక్టీరియాకు ఆహారం అందించి, జీర్ణ వ్యవస్థను బలపరుస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. ప్రతిరోజూ సుమారు 100-200 మిల్లీలీటర్ల (అర గ్లాసు నుండి ఒక చిన్న గ్లాసు వరకు) బీట్‌రూట్ రసం తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావిస్తారు. బీట్‌రూట్ రసం ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉన్నవారు దీనిని సేవించకూడదు. అయితే, వైద్యుడి సలహా మేరకు బీట్ రూట్ జ్యూస్ తీసుకోవటం ఉత్తమం.

# సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా.. ఇంట్లోనే ఇలా ఈజీగా తయారు చేసుకోండి..!

పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే స్వీట్ రెసిపీల్లో హల్వా ఒకటి. బ్రెడ్ తోనే కాదు ఈ హల్వాల్లో చాలా రకాలు ఉంటాయి. ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్వీట్ ను ప్రిపేర్ చేసుకుంటారు. అందులో బ్రెడ్ హల్వాను చాలామంది ఇష్టంగా తింటారు. ఈ రెసిపీ తయారు చేసుకోవడం కూడా ఈజీనే. మరి ఈ సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. బ్రెడ్ హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే బ్రెడ్ ముక్కలు ఆరు, నెయ్యి నాలుగు టేబుల్ స్పూన్ లు, పాలు రెండు కప్పులు, చక్కెర ముప్పావు కప్పు లేదా రుచికి సరిపడా, కండెన్స్ డ్ మిల్క్ పావు కప్పు, యాలకుల పొడి అర టీ స్పూన్, కేసరి కొద్దిగా, జీడిపప్పు 10 నుంచి 12, బాదం ఎనిమిది నుంచి పది, పిస్తా ఒక టేబుల్ స్పూన్, ఎండు ద్రాక్ష ఒక టేబుల్ స్పూన్, పాల పొడి ఒక టేబుల్ స్పూన్, గోధుమ రంగు ఫుడ్ కలర్ కొద్దిగా, ఉప్పు రుచికి సరిపడా తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే.. ముందుగా బ్రెడ్ ముక్కల్ని అంచులు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి లేదా చేతితో మెత్తగా చేయాలి. ఇప్పుడు గిన్నెలో నెయ్యి వేసి వేడి చేసి అందులో జీడిపప్పు, బాదం, ఎండు ద్రాక్ష వేసి బంగారం రంగు వచ్చే విధంగా వేయించుకోవాలి. ఆ తర్వాత పక్కకు తీసి పెట్టాలి. ఇప్పుడు అదే గిన్నెలో మిగిలిన నెయ్యి వేసి బ్రెడ్ ముక్కలు వేసి మీడియం ఫ్లేమ్ లో గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేంత వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు పాలు పోసి మెల్లగా వేయించుతూ ఉండాలి. బ్రెడ్ పాలను పీల్చుకునేంత వరకూ వేయించుకోవాలి. చక్కెర, కండెన్స్ డ్ మిల్క్, యాలకుల పొడి, కేసరి వేసి బాగా కలపాలి. అలా మిశ్రమం గట్టిగా అయ్యేంత వరకూ వేయించుతూ ఉండాలి. ఇప్పుడు వేయించిన డ్రై ఫ్రూట్స్ , పాల పొడి, ఉప్పు చిటికెడు కలిపి మరో రెండు నిమిషాలు కలుపుకోవాలి. అంతే సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా రెడీ అయినట్టే.. మీరు కూడా ఇంట్లో ఇదే విధంగా ట్రై చేయండి..



# పర్ ఫెక్ట్ 'అటుకుల ఉప్మా'.. ఇలా చేస్తే టేస్ట్ అదుర్స్ అంతే..!

అటుకుల ఉప్మా(పోహా) అంటే చాలా మందికి ఇష్టం.. రుచికి రుచి.. పోషకాలకు పోషకాలు అందించే ఈ టేస్టీ అటుకుల ఉప్మాను చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టంగా తింటారు. మరి రుచికరమైన అటుకుల ఉప్మా ను ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఇంట్లోనే సులభంగా ఈ అటుకుల ఉప్మాను తయారు చేసుకోవడం ఎలా..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం.. అటుకుల ఉప్మా తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. అటుకులు(లావు సైజులో ఉన్నవి) రెండు కప్పులు(200 గ్రాములు), పల్లీలు రెండు నుంచి మూడు టేబుల్ స్పూన్ లు, పోపు దినుసులు ఒక టేబుల్ స్పూన్ లు, ఉల్లిపాయలు ఒకటి, పచ్చిమిర్చి మూడు లేదా నాలుగు చీలికలుగా చేసినవి, కరివేపాకు ఒక రెబ్బ, పసుపు అర టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, నిమ్మరసం ఒక టేబుల్ స్పూన్, కరివేపాకు ఒక రెబ్బ, కొత్తిమీర కొద్దిగా తీసుకోవాలి. ఇప్పుడు అటుకుల ఉప్మా తయారీ విధానం చూస్తే.. ముందుగా అటుకులను తీసుకుని జల్లెడలో వేసి ఒకటికి రెండు సార్లు కడిగి నీరు మొత్తం పోనివ్వాలి. కానీ అటుకులను నాన బెట్టకూడదు. ఇప్పుడు పల్లీలు వేయించాలి. నూనెలో పల్లీలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఆ నూనెలో పోపు దినుసులు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత తక్కువ మంటపై అటుకులను పల్లీలు వేసి జాగ్రత్తగా కలుపుకోవాలి. ఇప్పుడు మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించుకోవాలి. ఆ తర్వాత అటుకుల పోహాపై నిమ్మరసం చల్లాలి. చివరగా కొత్తిమీర గార్నిష్ చేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకుంటే సరి.. సూపర్ టేస్టీ అటుకుల ఉప్మా రెడీ అయినట్టే.. ఇలా అటుకుల ఉప్మాను మీరు కూడా ట్రై చేసుకోండి.. టేస్ట్ అద్భుతంగా ఉంటుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## ఆస్ట్రేలియా జట్టులో భారత సంతతి క్రికెటర్.. స్పిన్ బౌలర్ నిఖిల్ చౌదరీకి చోటు

సిడ్నీ: భారత సంతతి క్రికెటర్ నిఖిల్ చౌదరీ ఆస్ట్రేలియా జట్టుకు ఆడబోనున్నాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లో ఆల్‌రౌండర్ నిఖిల్‌కు చోటు దక్కింది. ఆరు దశాబ్ధాల తర్వాత భారత క్రికెటర్ .. ఆస్ట్రేలియా తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్థానికంగా హోబర్ట్ హరికేన్స్ జట్టు తరపున నిఖిల్ ఆడుతుంటాడు. ఒకవేళ అన్నీ కుదిరితే, వచ్చే వారం బంగ్లాతో జరిగే టీ20 మ్యాచ్‌లో అతను ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేయనున్నాడు.బెల్జియంలో



జరుగుతున్న ఈయూ20 టోర్నీలో జేబీ బ్రూగ్స్ జట్టు తరపున నిఖిల్ ఆడుతున్నాడు. ఇటీవల ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో అతను ఉన్నాడు. లెన్ స్పిన్నర్ అయిన నిఖిల్.. బ్యాటింగ్ కూడా చేయగలడు. మిడిల్ ఆర్డర్‌లో బెర్త్ కోసం జోయల్ డేవిస్, ఆరన్ హార్డీతో అతను పోటీపడనున్నాడు. జూన్ 17 నుంచి 21 వరకు టీ20 సిరీస్ జరగనున్నది. బీబీఎల్ టోర్నీలో అతని ఫామ్ ఆకట్టుకున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్లు తెలిపారు.ఆస్ట్రేలియా తరపున భారత సంతతి క్రికెటర్లు గతంలోనూ ఆడారు. గుర్విందర్ సింధు, తన్వీర్ సంఘాలు ఆస్ట్రేలియా తరపున ప్రాతినిధ్యం వహించారు. కానీ వాళు 1960 కన్నా ముందు ఆసీస్ తరపున ఆడారు. చివరిసారి 1964లో రెక్స్ సెల్లార్స్ అనే గుజరాతీ ప్లేయర్ ఆసీస్ తరపున ఆడాడు. ఇక పుణెలో పుట్టిన లీసా సత్లేకర్ కొన్నాళ్లు ఆస్ట్రేలియాకు ఆడారు. ఆమె 2003లో ఆసీస్ తరపున అరంగేట్రం చేసి 2013 వరకు ఆడారు.నిఖిల్ చౌదరీ వయసు 30 ఏళ్లు. అతను ఆస్ట్రేలియా సిటిజన్ కాదు, కానీ అతను పర్మనెంట్ రెసిడెంట్. అయితే దత్తత తీసుకున్న దేశం చట్టాల ప్రకారం అతను ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడే అవకాశం ఉన్నది. ఢిల్లీలో పుట్టిన అతను పంజాబ్ తరపున 14 ఏ లిస్టు మ్యాచ్‌లు ఆడాడు. కోవిడ్ సమయంలో క్వీన్స్‌ల్యాండ్‌లోని మేనమామ ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో అతను ఆస్ట్రేలియాలో క్రికెట్ ఆడాడు. హోబర్ట్‌కు బీబీఎల్ టైటిల్ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో అతను 30 సగటుతో 307 రన్స్ చేశాడు.

## వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1గా టీమిండియా..

అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన పురుషుల వార్షిక వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. గత మూడేళ్ల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుని ఐసీసీ ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. అయితే, ఈ ప్రక్రియలో భారత్ రేటింగ్ పాయింట్లు 119 నుంచి 118కి స్వల్పంగా తగ్గాయి.దీంతో తొలి రెండు స్థానాల్లో ఉన్న భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య పాయింట్ల వ్యత్యాసం 8 నుంచి 5 పాయింట్లకు పడిపోయింది. ప్రస్తుతం కివీస్ జట్టు రెండు పాయింట్లను మెరుగుపరుచుకుని 113 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇక ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియా జట్టు ఎలాంటి మార్పు లేకుండా 109 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుందిటాప్-10లో జరిగిన ఏకైక మార్పు ఏమిటంటే..




పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి దక్షిణాఫ్రికా (102) నాలుగో స్థానానికి చేరుకుంది. కాగా, వన్డేలతో పాటు టీ20 ర్యాంకింగ్స్‌లోనూ భారత్ నం.1 స్థానంలోనే కొనసాగుతుండటం విశేషం. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. మహిళల వన్డే , టీ20ఐ జాబితాలు రెండింటిలోనూ ఆస్ట్రేలియా నం. 1 స్థానంలో ఉంది.

## బెన్ స్టోక్స్ రిటైర్‌మెంట్ నిర్ణయం తీసుకోవద్దు: ఇంగ్లండ్ మాజీ ప్లేయర్



మద్యం మత్తులో నైట్ క్లబ్‌లో ఓ రగ్బీ ఆటగాడితో గొడవపడిన నేపథ్యంలో బెన్ స్టోక్స్‌పై ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) క్రమశిక్షణా చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. జూన్ 17 నుంచి 21 మధ్య ఓవెల్ వేదికగా న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో టెస్ట్‌కు దూరం కానున్నాడు. అతడి స్థానంలో సీనియర్ బ్యాటర్ జోరూట్ ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్‌గా ఈసీబీ నియమించింది. మరోవైపు స్టోక్స్ రెండో టెస్టుకు మాత్రమే దూరమైనప్పటికీ, అతడు అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్టోక్స్‌కు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసర్ హుస్సేన్ కీలక సూచనలు ఇచ్చాడు.భావోద్వేగపరంగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉండే ఈ సమయంలో రిటైర్మెంట్ లాంటి నిర్ణయం తీసుకోవద్దని నాసర్ హుస్సేన్ స్టోక్స్‌కు సూచించాడు. ఓ స్పోర్ట్స్ పాడ్‌కాస్ట్‌లో హుస్సేన్ మాట్లాడుతూ.. 'బెన్ స్టోక్స్ ఇంగ్లండ్‌కు చాలా కాలం పాటు అండగా నిలిచాడు. అతడు కెప్టెన్‌గా, ఆటగాడిగా కీలక టోర్నీల్లో జట్టుకు తోడుగా ఉన్నాడు. అతడు ఇంగ్లండ్ కోసం ఒక యోధుడిలా పోరాడాడు. కానీ ఈసారి ఓ తప్పు చేశాడు. అయితే అది అతడిని కెప్టెన్సీ నుంచి తొలగించే అంత పెద్ద తప్పిందం అని నేను అనుకోవడం లేదు' అని వెల్లడించాడు.'ప్రస్తుతం బెన్ చాలా బాధలో ఉంటాడు. తాను చాలా మందిని నిరాశపర్చినట్లు భావించి.. భావోద్వేగంతో రిటైర్మెంట్ తీసుకోవాలని బెన్ అనుకోకూడదని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే, అలా చేస్తే ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్‌గా ఉన్న అతడి కెరీర్‌కు అది చాలా విచారకరమైన ముగింపు అవుతుంది. అతడు గొప్ప గౌరవంతో క్రికెట్ నుంచి వీడ్కోలు పలకాలని నేను భావిస్తున్నారు' అని నాసర్ హుస్సేన్ తెలిపాడు. రిటైర్మెంట్ విషయంపై తుది నిర్ణయం పూర్తిగా స్టోక్స్ చేతుల్లోనే ఉన్నప్పటికీ, అతడు కొందరి అభిప్రాయాలను కోరుతున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే, ఒక ఇంగ్లండ్ దిగ్గజం ఈ విధంగా నిష్క్రమించడాన్ని హుస్సేన్ ఇష్టపడటం లేదు.

## డబ్బు కంటే గౌరవమే ముఖ్యం: వైభవ్ తండ్రి సంజీవ్

దేశం తరపున ఆడాలన్న యువ క్రికెటర్, చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ కల నెరవేరింది. ఇటీవల ఐపీఎల్ 2026లో ఆరెంజ్ క్యాప్‌తో పాటు భారత సీనియర్ టీ20 జట్టు (ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటన)కు ఎంపికైన బిహారీ కుర్రాడిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. తన కుమారుడు జాతీయ జట్టుకు ఎంపిక కావడంపై వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జాతీయ జట్టుకు ఎంపికయ్యే వరకు వైభవ్ పడిన కష్టాలను ఆయన గుర్తు చేసుకున్నారు.'చిన్నప్పటి నుంచే భారత జట్టుకు ఆడాలనే బలమైన లక్ష్యంతో వైభవ్ కష్టపడ్డాడు. అతడిలోని ఆ పట్టుదల చూసి, పూర్వీకుల భూమిని అమ్మి మరీ శిక్షణ ఇప్పించాను' అని సంజీవ్ పేర్కొన్నారు. అతడు ఇప్పటివరకు తన కొడుకని, నేటి నుంచి దేశానికి బిడ్డ అని గర్వంగా చెప్పారు. తమకు డబ్బు కంటే దేశం తరపున ఆడి.. తెచ్చే గౌరవమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. వైభవ్ జాతీయ జట్టుకు ఎంపికైన బీసీసీఐ నుంచి తమకు పత్రాలు వచ్చాయని, తాము ఇంగ్లండ్ వెళ్తున్నామని సంజీవ్ పేర్కొన్నారు. కేవలం 15 ఏళ్లకే సచిన్ టెండూల్కర్ రికార్డులను అధిగమిస్తూ టీమిండియాలో చోటు దక్కించుకోవడంతో వైభవ్ కుటుంబంలో, అతడి స్వగ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.




## భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన రాహుల్ ద్రవిడ్ కుమారుడు



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ బ్యాట్స్‌మెన్ రాహుల్ ద్రవిడ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రియులను అలరించాడు. అలానే కోచ్ గా మారి.. భారత్‌కు పలు ఐసీసీ టోర్నీలు అందించాడు. తాజాగా మరో ద్రవిడ్ టీమిండియా జెర్సీని ధరించనున్నాడు. ద్రవిడ్ చిన్న కుమారుడైన వికెట్ కీపర్, బ్యాటర్ అన్వయ్ ద్రవిడ్‌కు భారత అండర్-19 జట్టులో చోటు దక్కింది. ఈ జట్టు వచ్చే నెలలో శ్రీలంకతో వన్డే సిరీస్ ఆడనుందిశ్రీలంక పర్యటనకు బీసీసీఐ అండర్19 జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ సారథిగా వ్యవహరించనున్నాడు. కాగా జులై 4న ప్రారంభమయ్యే ఈ పర్యటనలో టీమిండియా-19 శ్రీ లంకతో వన్డే, ఫోర్ డే మ్యాచ్‌లు ఆడనుంది. వన్డే జట్టులోని ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకడిగా అన్వయ్‌కు సెలక్టర్లు అవకాశం ఇచ్చారు. గతేడాది నవంబరులో చివరగా అన్వయ్ ద్రవిడ్ భారత అండర్19 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. స్వదేశంలో అఫ్గానిస్థాన్ అండర్19 జట్టుతో ఆడిన భారత్ 'బి' జట్టులో అతడు సభ్యుడిగా ఉన్నాడు. దేశీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న ఈ వికెట్ కీపర్ బ్యాటర్‌కు సెలక్టర్లు తాజాగా మరోసారి అవకాశం ఇచ్చారు.సాగర్ విర్క్, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (కెప్టెన్), లక్ష్య రాయచందాని (వైస్ కెప్టెన్), వినీత్ వీకే, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘెల్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), అన్మోల్జీత్ సింగ్, పూట్కూరి యశ్వీర్ గౌడ్, రోహిత్ అనిల్ యాదవ్, శవిన్ వి, కావ్యా పరేశ్ పటేల్, మోహిత్ ఉల్వా. ఇషాన్ సూద్.అండర్ 19: భారత్, శ్రీలంక షెడ్యూల్హంబన్‌టోటా వేదికగా మూడు వన్డేలు2026 జూలై 4, జూలై 6, జూలై 9 తేదీల్లో వన్డేలు2026 జూలై 13-16 మధ్య మొదటి యూత్ టెస్టు; వేదిక: గాలే2026జూలై 20-23 మధ్య రెండో యూత్ టెస్టు; వేదిక: కొలంబో

## పీవీ సింధుకు కోచ్‌గా మారిన భర్త వెంకట దత్త సాయి

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు భర్త వెంకట దత్తసాయి అనుకోకుండా కోచ్‌గా మారారు. వృత్తిరీత్యా ఆయన డేటా సైంటిస్ట్. కానీ, సింధు కోసం కాసేపు కోచ్‌గా మారి తన భార్యకు మద్దతుగా నిలిచాడు. ఇదే విషయాన్ని పీవీ సింధు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో తనకు ఎదురైన అనుభవాన్ని సింధు వెల్లడించింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే...ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో పీవీ సింధు మరో భారత షట్లర్ ఇషారాణి బారువాపై 22-20, 21-12 తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన అనుభవాన్ని సింధు తెలియజేసింది. 'నాకు ఉదయం నుంచి ఒంట్లో అంతగా బాగోలేదు. అలాంటి సమయంలో మనోధైర్యం అవసరం అనిపించింది. నాకు తెలిసిన వారితో గొప్ప ఎనలిస్ట్‌ను పిలిచాను. మా ఇద్దరికి ఒకరే కోచ్ కావడంతో.. నేను కోచ్‌ను పిలిచి ఇషాను ఇబ్బంది పెట్టాలనుకోలేదు. దీంతో నా భర్త దత్తసాయికి ప్రమోషన్ ఇచ్చి.. ఆయనను కోచ్‌గా పరిచయం చేశాను' అని సింధు పోస్టులో రాసుకొచ్చిందినిజం చెప్పాలంటే.. నాకు ఈ కోచ్ వద్దు బాబోయ్ అనేంతగా బాగా ప్రోత్సహించారు. అయితే, రిఫరీ నుంచి రెండు హెచ్చరికలు అందుకొన్నా. కార్డు లేకుండానే ఎలాగోలా దీన్నుంచి బయటపడ్డాం. రెండో గేమ్ ప్రారంభమయ్యే సరికి ఇషాను సరిగ్గా అంచనా వేయగలిగాను. భర్త క్రీడాభిమాని అయితే..ఇలాంటి అత్యవసర సమయాల్లో సాయపడుతుంది' అని పీవీ సింధు పోస్టు పెట్టింది. ఆమె చేసిన పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఈ విజయంతో క్వార్టర్ ఫైనల్స్ బెర్త్ ను ఖరారు చేసుకుంది. ఇషారాణి బారువాను ఓడించడానికి పీవీ సింధుకు 42 నిమిషాలు పట్టింది. ఉత్కంఠభరితంగా సాగిన మొదటి సెట్‌ను అతి కష్టం మీద గెలుచుకుంది. రెండవ గేమ్‌లో బరువాను తిరిగి పుంజుకోనివ్వకుండా చివరకు విజయం సాధించింది. ఈ ఏడాది సింధుకు ఇది ఐదో క్వార్టర్ ఫైనల్.



## అదరగొట్టిన భారత బ్యాటర్లు.. అఫ్గాన్ ముందు భారీ టార్గెట్

స్పోర్ట్స్ డెస్క్: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆఫ్గానిస్తాన్ ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్ లో భారత్ ఏ జట్టు బ్యాటర్లు అదరగొట్టేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆటను 49 ఓవర్లకు కుదించడం జరిగింది. టీమిండియా బ్యాటర్లలో ప్రభ్ సిమ్రన్ సింగ్ (84), రుతురాజ్ గైక్వాడ్ (66), తిలక్ వర్మ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్లా 5 వికెట్లు తీసి.. భారత్ మరింత భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేశాడు. అలానే సాఫి 3, ఇమ్రాన్ ఒక వికెట్ తీశారు.ముక్కోణపు సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో త్వరగానే పెవిలియన్‌కు చేరిన వైభవ్ సూర్యవంశీ ఈ సారి మాత్రం దుమ్ములేపాడు . ఆరంభం నుంచే దూకుడుగా ఆడటం మొదలు పెట్టాడు. అయితే, సిక్స్‌లు లేకుండా కేవలం ఫోర్లతోనే ఇన్నింగ్స్‌ను ఆడటం విశేషం. 22 బంతుల్లోనే 44 పరుగులు వ్యక్తిగత స్కోర్ వద్ద అబ్దుల్లా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు.మరోవైపు ప్రభ్ నిలకడగా ఆడుతూనే అప్పుడప్పుడు దూకుడు ప్రదర్శించాడు. ప్రియాంశ్ ఆర్య (8) త్వరగానే ఔటయ్యాడు. కానీ, రుతురాజ్, తిలక్ వర్మ జోడీ మాత్రం చెలరేగి ఆడింది. నిలకడగా ఆడుతూనే పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో అర్ధ శతకాలు నమోదు చేశారు. ఆఖర్లో సూర్యాంశ్ షెడ్జే (40), అనుకుల్ రాయ్ (16×) వేగంగా ఆడారు. కానీ, స్వల్ప వ్యవధిలో వికెట్లను కోల్పోవడంతో భారత్ 350 మార్క్‌ను అందుకోలేకపోయింది. మొత్తంగా అఫ్గాన్ జట్టు ముందు 350 పరుగుల టార్గెట్‌ను టీమిండియా నిర్దేశించింది.



# సాం3" సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది - డైరెక్టర్ కృష్ణమాయ



సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సాం3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ "ఈశ్వర్" సినిమాలో కృష్ణమాయ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వర్ సినిమా రీరిలీజ్ సందర్భంగా ట్రిబ్యూట్ గా ఈ రోజు "సాం3" మూవీ టీమ్ స్పెషల్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా

యాక్టర్ అదిరే అభి మాట్లాడుతూ – నెక్ట్స్ ఇయర్ కు ఈశ్వర్ సినిమా పాతికేళ్లకు చేరుకుంటుంది. అప్పుడు ఓ గెట్ గెదర్ పెట్టుకోవాలని, అందుకు కృష్ణమాయ గారు ఇనిషేటివ్ తీసుకోవాలి కోరుతున్నా. ఈశ్వర్ చిత్రంలో మేము ప్రభాస్ గారి ఫ్రెండ్స్ గా నటించాం. ఆ మూవీతో మాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రభాస్ గారు ఈ రోజు బిగ్ స్టార్ అయ్యారు. ఈశ్వర్ సినిమా టైమ్ నుంచే కృష్ణమాయ మంచి స్నేహితులు అయ్యారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న "సాం3" సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు.

హీరో సామ్రాట్ మాట్లాడుతూ – ప్రభాస్ గారు మా అందరికీ ఫేవరేట్ హీరో. ఆయన ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ కు మేమంతా టీమ్ గా వెళ్లి థియేటర్స్ లో సినిమా చూస్తాం. ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా మూవీ ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం హ్యాపీగా ఉంది. "సాం3" సినిమా కంటెంట్ చూసిన ప్రతి ఒక్కరూ మూవీ చాలా బాగుందంటూ చెబుతున్నారు. ఈ సినిమా కోసం కృష్ణమాయ గారితో పాటు మేమంతా హార్డ్ వర్క్ చేస్తున్నాం. మేము పడిన కష్టం తప్పకుండా ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతున్నాం. అన్నారు.

హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ – ప్రభాస్ గారి ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా సినిమా నుంచి ట్రిబ్యూట్ గా ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. "సాం3" సినిమా డబ్బింగ్, ఎడిటింగ్ దశలోనే అందరిలోనూ పాజిటివ్ వైబ్స్ ఏర్పడుతున్నాయి. ఈ సినిమా ఔట్ పుట్ మేము అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. తప్పకుండా "సాం3" సినిమా మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు.

నటి శ్రావణ సంధ్య మాట్లాడుతూ – డైరెక్టర్ కృష్ణమాయ నాకు గతంలో రైల్వే స్టేషన్ మూవీలో నటించే అవకాశం కల్పించారు. ఆ సినిమా టైమ్ లో రిహార్సల్స్ చేయించి పర్ఫెక్ట్ గా వచ్చేలా షూటింగ్ చేశారు. ఇప్పుడు మళ్లీ ఈ చిత్రంలో నాకు మంచి క్యారెక్టర్ ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. "సాం3" సినిమా నా క్యారెక్టర్ సర్ ప్రైజ్ చేసేలా ఉంటుంది. అన్నారు.

సెకండ్ హీరోయిన్ హారిక రవి మాట్లాడుతూ – ప్రభాస్ గారి ఈశ్వర్ సినిమా మా అందరికీ ఫేవరేట్ మూవీ. నేను ఆ సినిమా థియేటర్స్ లో రిలీజ్ అయినప్పుడు పుట్టలేదు అనుకుంటా. ఇప్పుడు 4కె లో రీ రిలీజ్ అవుతోంది. మేమంతా థియేటర్స్ లో చూస్తాం. "సాం3" సినిమాలో నాకు సెకండ్ హీరోయిన్ గా అవకాశం ఇచ్చిన కృష్ణమాయ గారికి థ్యాంక్స్. ఆయన యాక్టింగ్ ను ఫాలో అవుతూ ఈ క్యారెక్టర్ చేశాను. అన్నారు.

అతిథిగా వచ్చిన నిర్మాత అశోక్ కుమార్ మాట్లాడుతూ – మా ఈశ్వర్ చిత్రంతో పరిచయమైన ప్రభాస్ గారు పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోగా పేరు తెచ్చుకున్నారు. ఆ సినిమా మళ్లీ రీ రిలీజ్ అవుతోంది. చాలా సంతోషంగా ఉంది. ఆ సందర్భంగా "సాం3" సినిమా తరుపున ఒక ట్రిబ్యూట్ గా కృష్ణ మాయ ఈ ప్రెస్ మీట్ నిర్వహిస్తుండటం హ్యాపీగా ఉంది. కృష్ణమాయ చాలా ప్లాన్డ్ గా ఈ సినిమాను చేశాడు. సినిమా కంప్లీట్ చేసి ప్రమోషన్ మొదలుపెట్టాడు. ప్రతి రూపాయి సినిమా మీద ఖర్చు పెట్టాలని అతని ఆలోచన. పాటలు బాగున్నాయి. సినిమా కూడా బాగా చేశాడు. దాసరి గారు, కోడి రామకృష్ణ గారిలా మట్టిలో మాణిక్యాలు ఏరే దర్శకుడు కృష్ణమాయ. ఈ సినిమాతో అమ్మాయి లిఖితకు మంచి పేరు రావాలి. ఈ మూవీ తప్పకుండా హిట్ కావాలి. కృష్ణమాయకు సినిమా మీద ప్యాషన్. మా మూవీస్ కు వర్క్ చేసేప్పుడు ఏ పనిచెప్పినా వెంటనే చేసేవాడు. ఇండస్ట్రీ ఇప్పుడు గడ్డు పరిస్థితుల్లో ఉంది. ఓటీటీల వల్ల థియేటర్స్ కు ప్రేక్షకులు రావడం లేదు. కంటెంట్ బాగుంటే తప్ప మూవీస్ గట్టెక్కడం లేదు. ఈ సినిమా మంచి కంటెంట్ తో వస్తోంది. ప్రేక్షకుల ఆదరణ పొందాలని కోరుకుంటున్నా. అన్నారు.

దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ – ఈశ్వర్ సినిమాకు నేను ఆర్ట్ డైరెక్టర్ తో పాటు నలుగురు ఫ్రెండ్స్ లో ఒకరిగా నటించాను. ఈ సినిమా మాకు మంచి పేరు తీసుకొచ్చింది. ఈశ్వర్ చిత్రంలో నటిస్తున్నప్పుడు మూవీ ఇంత బ్లాక్ బస్టర్ అవుతుందని ఊహించలేదు. ప్రభాస్ గారు, అభి, నేను, హనుమంతు..ఇలా అంతా సరదాగా కలిసి చేశాం. ప్రభాస్ కూడా మాతో పాటు సరదాగా ఉండేవారు. అంతా చిన్న పిల్లల్లాం ఆడుతూ పాడుతూ సినిమా చేశాం. కిందే కూర్చుని కలిసి భోజనం చేసేవాళ్లం. ఈ రోజు ప్రభాస్ గారు పెద్ద స్టార్ అయ్యారు. అంత పెద్ద స్టార్ మొదటి చిత్రంలో మేమంతా కలిసి నటించాం అని చెప్పుకోవడం గర్వంగా ఉంది. అశోక్ కుమార్ గారు నాకు గురువు లాంటివారు. ఆయనను చూసే ప్రొడక్షన్ ఎలా చేయాలో నేర్చుకున్నాను. ఎవరికీ రూపాయి బ్యాలెన్స్ పెట్టకుండా కాంపాక్ట్ బడ్జెట్ లో పద్ధతిగా సినిమా ఎలా నిర్మించాలో అశోక్ కుమార్ గారి దగ్గర తెలుసుకున్నాను. "సాం3" సినిమా విషయానికి వస్తే నేను డైరెక్షన్ చేస్తూ నిర్మిస్తున్నాను. సరికొత్త కంటెంట్ తో ఈ సినిమాను రూపొందించాను. త్వరలోనే థియేట్రికల్ గా సినిమాను రిలీజ్ చేస్తాం. మా హీరో హీరోయిన్స్ అందరూ అద్భుతంగా పర్ ఫార్మ్ చేశారు. "సాం3" సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం. అన్నారు.

హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ కోసం మేమంతా వెయిట్ చేస్తున్నాం. ఈ సందర్భంగా మీ ముందుకు మరోసారి మా టీమ్ రావడం హ్యాపీగా ఉంది. ఇక మా చిత్రం గురించి మాట్లాడాలంటే.. "సాం3" ఔట్ పుట్ చాలా బాగా వస్తోంది. ఈ సినిమాతో మా టీమ్ అందరికీ మంచి గుర్తింపు దక్కుతుందని నమ్ముతున్నాం. త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ తో "సాం3" సినిమాను మీ ముందుకు తీసుకొస్తాం. అన్నారు.

ప్రొడ్యూసర్ వి. విజయ మాట్లాడుతూ – "సాం3" వంటి మంచి చిత్రాన్ని నిర్మించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ కావాలి. ఈ మూవీతో పెద్ద విజయాన్ని అందుకోబోతున్నాం. మా ఆర్టిస్టులంతా తమ పర్ ఫార్మెన్స్ లతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటారు. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం. అన్నారు.

నటీనటులు – సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత, తదితరులు

# కింగ్ నాగార్జున వందో మూవీ

## సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం

టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎలాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా ఉంటుంది? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. మరి కింగ్ 100తో నాగార్జున ఎలా ఎలాన్ చేస్తున్నాడో చూడాలి.

# సినిమా

# క్రేజీ లవ్ స్టోరీతో 'దీవాన'.. ట్రైలర్ ఎలా ఉందంటే..

## ఇప్పటికే విడుదలైన టీజర్ తో యూత్ లో మంచి బజ్ క్రియేట్ చేసుకున్న ఆ సినిమా, తాజాగా విడుదలైన ట్రైలర్ తో మరింత హైప్ ను సొంతం చేసుకుంది.




శుభం మూవీతో హీరోగా తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన హర్షిత్ రెడ్డి, ఇప్పుడు మరో యూత్ ఫుల్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ దీవాన. స్నేహ మణివేంగలై హీరోయిన్ గా నటిస్తున్న ఆ చిత్రానికి శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ తో యూత్ లో మంచి బజ్ క్రియేట్ చేసుకున్న ఆ సినిమా, తాజాగా విడుదలైన ట్రైలర్ తో మరింత హైప్ ను సొంతం చేసుకుంది.

జూన్ 19న థియేటర్లలో విడుదల కానున్న ఆ సినిమా ట్రైలర్ ను మూవీ టీమ్ తాజాగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ట్రైలర్ చూస్తే ఇది కేవలం నార్మల్ లవ్ స్టోరీ కాదని, ఒక వన్ సైడ్ లవ్ చుట్టూ తిరిగే ఎమోషనల్ జర్నీ అని అర్థమవుతోంది. "ఎంత గొప్ప లవ్ స్టోరీ అయినా వన్ సైడ్ లవ్ తోనే స్టార్ట్ అవుతది రా భాయ్" అనే డైలాగ్ తో ప్రారంభమైన ట్రైలర్ మొదటి నుంచే ఆసక్తిని పెంచుతుంది.

హైదరాబాద్, తెలంగాణ యాసలో సాగే కన్వర్జేషన్స్ ట్రైలర్ కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హీరో తన లవర్ 'అమ్ము' ప్రేమను పొందేందుకు చేసే ప్రయత్నాలు, ఆమె కోసం పడే తపన, మధ్యలో ఎదురయ్యే పరిస్థితులు ట్రైలర్ లో మెయిన్ గా కనిపించాయి. ప్రేమలోని బాధ, ఆవేదన, ఆశ, పట్టుదల వంటి ఎలిమెంట్స్ ను డైరెక్టర్ చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

అంతేకాదు, లవ్ స్టోరీతో పాటు యాక్షన్, ఎంటర్టైన్మెంట్ సినిమాలో ఉండబోతున్నాయని ట్రైలర్ స్పష్టం చేసింది. హీరోయిన్ ను ఇబ్బంది పెట్టే వ్యక్తిపై హీరో తిరగబడే సన్నివేశాలు, స్నేహితులతో కలిసి వచ్చే సరదా సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. దీంతో ఇది కేవలం రొమాంటిక్ డ్రామాగా కాకుండా కంప్లీట్ యూత్ ఎంటర్టైనర్ గా ఉండబోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

"లవ్ తో ఉన్న ప్రాబ్లం ఏందో తెలుసా.. అందులో సత్యంత ప్రేమ లేకపోతే అది లవ్వే కాదురా భాయ్", "ఐ యామ్ నాట్ బేవర్స్.. ఐ యామ్ మ్యాన్ అండ్ ఐ టేక్ కేర్ ఆఫ్ యు" వంటి డైలాగ్స్ సినిమాలోని ఎమోషనల్ ఇంటెన్సిటీని చూపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రెజెంట్ జెనరేషన్ యూత్ ప్రేమను ఎలా చూస్తుందో, వన్ సైడ్ లవ్ లో ఉండే బాధ ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.

గతంలో తొలిప్రేమ, ఆర్య, ఆర్య 2, 7/జీ బృందావన్ కాలనీ వంటి సినిమాలు వన్ సైడ్ ప్రేమ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుని సెన్సేషన్ సృష్టించాయి. ఇప్పుడు ప్రెజెంట్ జెనరేషన్ యూత్ కు దగ్గరగా ఉండే కథతో దీవాన తెరకెక్కిందని చిత్రబృందం చెబుతోంది. "వన్ సైడ్ లవ్ అంటే చస్తుంటాం.. మస్తుంటాది" అంటూ యువతకు కనెక్ట్ అయ్యేలా ఆ సినిమాను రూపొందించినట్లు చెబుతోంది.

గీతా ఆర్ట్స్ సమర్పణలో వీ స్టూడియోస్, అర్హా మీడియా భాగస్వామ్యంతో రూపొందిన ఆ చిత్రాన్ని వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. కొత్త క్యాస్టింగ్, లోకల్ ఎలిమెంట్స్ కు దగ్గరగా ఉండే కథ, యూత్ కు కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ తో వస్తున్న దీవాన ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. మరి ట్రైలర్ తో పెంచిన అంచనాలను సినిమా ఎంతవరకు అందుకుంటుందో జూన్ 19న తెలియనుంది.

# రామ్‌చరణ్ నటన మైండ్ బ్లోయింగ్

## జగపతి బాబు పాత్ర అద్భుతంగా ఉంది పెద్దిపై బన్నీ ప్రశంసలు



వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ చరణ్ అద్భుతంగా రాణించాడని, ప్రస్తుతం అతడికి వస్తున్న ప్రశంసల్లో ప్రతి ఒక్కటి అతడు సంపాదించుకున్నవేనని చెప్పారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఒక హీరోని మాత్రమే కాకుండా మొత్తం కథలోని పాత్రలన్నింటినీ బలంగా నిలబెట్టడం దర్శకుడి విజయమని ఆయన సందేశం ద్వారా స్పష్టమైంది. సాధారణంగా అభిమానుల మధ్య పోలికలు, ఫ్యాన్ వార్స్ ఎక్కువగా కన్పిస్తాయి. కానీ ఒక స్టార్ హీరో మరో స్టార్ హీరో పనితీరును ఇంత ఓపెన్ గా ప్రశంసించడం అరుదుగా జరుగుతుంది. అందుకే అల్లు అర్జున్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

# విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' స్టబ్జెక్ట్ మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో




కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్ట్రిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com